
కృష్ణానదిపై నిర్మించనున్న ఐకానిక్ వంతెన (పాత చిత్రం)



ఐకానిక్ మారిస్తే.. సమస్యే

కృష్ణానదిపై అమరావతి ఐకానిక్ బ్రిడ్జి నిర్మాణస్థలిని మార్చడం కొంత గందరగోళానికి దారితీస్తోంది. ఈ బ్రిడ్జిని రాయపూడి-ఫెర్రీ మధ్య కాకుండా ఎగువన రాయపూడి-మూలపాడు మధ్య నిర్మించాలన్న సరికొత్త ఏడీసీఎల్ తీసుకుంది. ఈ ప్రతిపాదనతో నిర్మాణ వ్యయం పెరగ డంతో పాటు జగదల్పూర్ హైవేతో అమరావతికి డైరెక్ట్ కనెక్టివిటి తప్పినట్లవుతుంది. పైగా ఎగువ ప్రాంతంలో దీనిని నిర్మించడం వల్ల భవిష్యత్‌లో అమరావతి అంతర వలయ రహదారికి ఒకింత ఇబ్బందులు తలెత్తే ప్రమాదం పొంచి ఉంది. ఐకానిక్ బ్రిడ్జి ఎన్టీఆర్ జిల్లా వైపు మూలపాడు నుంచి ప్రారంభమైతే ఐఆర్ఆర్ తాలూకు కృష్ణానదిపై నిర్మించాల్సిన కొత్త బ్రిడ్జి దానికి అతి చేరువలోనే కోటికలపూడి ప్రాంతంలో ఏర్పాటవుతోంది. ఈ రెండు బ్రిడ్జిలు పక్కపక్కనే వస్తే నష్టమేమి ఉండకపోవచ్చునేమోగానీ లాభం మాత్రం ఉండదు. అదే గతంలో ప్రతిపాదించినట్లుగా రాయపూడి-ఫెర్రీల మధ్య నిర్మిస్తే నిర్మాణ వ్యయం తగ్గడంతోపాటు జగదల్పూర్ హైవేతో అమరావతి నేరుగా సంధానించబడుతోంది.

- మరింత వ్యయం.. గందరగోళం
- కృష్ణానదిపై పక్కపక్కగానే వంతెనలు
- భవిష్యత్‌లో అమరావతి ఐఆర్ఆర్‌కు ఇబ్బందే
- ఏడీసీఎల్ నిర్ణయాన్ని పరిశీలించాలని పలువురి సూచన



కృష్ణ దిగువన రెండు వంతెనలు

ఇక ప్రకాశం బ్యారేజికి దిగువన ఓఆర్ఆర్ తాలూకు కృష్ణానదిపై ఓ వంతెన రావడంతో పాటు ఐఆర్ఆర్ నిర్మాణం జరిగితే ఇటు గుంటూరు జిల్లా చిర్రావూరు అటు కృష్ణాజిల్లా చోడవరం మధ్య మరో కొత్త వంతెన వచ్చినట్టవుతోంది. అంటే వైకుంఠపురం బ్యారేజి కమ్ బ్రిడ్జి, ఐఆర్ఆర్ నిర్మాణాలు జరిగితే కృష్ణానదిపై కొత్తగా మొత్తం ఆరు కొత్త వంతెనలు వాహనదారులకు అందుబాటులోకి వచ్చినట్టవుతుంది.

అమరావతికి గ్రాండ్ ఎంట్రీ

అమరావతికి మరింత గ్రాండ్ ఎంట్రీ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం రాయపూడి వద్ద ఎన్-13 రోడ్డును ఎన్టీఆర్ జిల్లా మూలపాడు వద్ద కలుపుతూ కృష్ణానదిపై 5.2 కిలోమీటర్ల పొడవునా ఐకానిక్ బ్రిడ్జిని నిర్మించాలని ఏడీసీఎల్ ప్రతిపాదించింది. ఈ ఐకానిక్ బ్రిడ్జి ఆరంభంలో మూలపాడు వద్ద ఓ భారీ స్వాగత ద్వారాన్ని అత్యంత ఆకర్షణీయంగా ఏర్పాటు చేయాలని కూడా ఏడీసీఎల్ నిర్ణయించింది. దీనికి సంబంధించి కూడా డీపీఆర్ తయారీ కి కన్సల్టెంట్‌లను ఆహ్వానిస్తుంది.

(ఆంధ్రజ్యోతి, మంగళగిరి)

కృష్ణానదిపై ఐకానిక్ బ్రిడ్జి మళ్లీ తెరమీదకు వచ్చింది. 2019 జనవరిలో రూ.1327 కోట్లతో దీనిని గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం రాయపూడి-ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం మండలం ఫెర్రీ పవిత్రసంగమం మధ్య కృష్ణానదిపై నిర్మించేందుకు అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సంస్థ సిద్ధమైంది. ఆ మేరకు అప్పట్లో సీఎం చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేసి పైలాన్‌ను కూడా ఆవిష్కరించారు. ఎల్అండ్‌టీ సంస్థ పనులను చేపట్టింది. ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ ఈ ప్రాజెక్టును మూలన పడేసింది. గతేడాది కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అమరావతి నగర నిర్మాణ పనులకు అత్యధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈ క్రమంలో గతంలో నిలిచిపోయిన ఐకానిక్ బ్రిడ్జి, వైకుంఠపురం బ్రిడ్జి, సీడ్ యాక్సిస్ రెండో దశ పనులపై దృష్టి సారించింది. అయితే ఐకానిక్ బ్రిడ్జిని గతంలో నిర్మించాలనుకున్న ప్రదేశం నుంచి మార్చాలనుకోవడం (మిగతా 8వ పేజీలో)

త్వరలో గుంటూరు ఛానల్ పనులు


- కొమ్మమూరు కాల్వ ఆధునికీకరణకు రూ.5 కోట్లు
- బాపట్ల జిల్లా కొత్తగొల్లపాలెంలో పింఛన్ల పంపిణీ చేసిన సీఎం చంద్రబాబు నాయుడు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

గుంటూరు ఛానల్ ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చూస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. సామాజిక పింఛన్ల పంపిణీ కోసం మంగళవారం చినగంజాం మండల పరిధిలోని కొత్తగొల్లపాలేనికి సీఎం వచ్చారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి స్వయంగా పింఛన్లను అందజేశారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రజా వేదికలో సీఎం పాల్గొని ప్రసంగించారు. పెండింగ్ ఉన్న నాగార్జున సాగర్ కాల్వల మరమ్మతులతో పాటు కాల్వల ఆధునికీకరణకు నిధుల నుత్వరలోనే మంజూరు చేస్తామన్నారు. కృష్ణా పశ్చిమ డెల్టా పరిధి లోని కొమ్మమూరు కాల్వల ఆధునికీకరణకు రూ.5 కోట్లు అదనంగా విడుదల చేస్తున్నట్లు సీఎం తెలిపారు. తీర ప్రాంత గ్రామాల అభివృద్ధికి రూ.14 కోట్లు విడుదలకు అనుమతిచ్చారు. బాపట్ల జిల్లా పరిధిలోని మోటుపల్లి తీరంలో ప్రతిపాదనల దశలో ఉన్న నౌక నిర్మాణ పరిశ్రమ సాధనకు హామీ ఇచ్చారు. రెండేళ్లలోనే గ్రామం రూపురేఖలను మార్చుతామన్నారు. ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్ది రాష్ట్రానికే నమూనా చేస్తామన్నారు.

పనితీరు ఆధారంగా రేటింగ్

తనతో సహా అందరి పనితీరుపై ఎప్పటికప్పుడు సమీక్ష జరిపి పని



తీరు ఆధారంగా రేటింగ్ ఇస్తామని చంద్రబాబు తెలిపారు. పార్టీ క్యాడర్ సమావేశంలో సీఎం మాట్లాడుతూ పని తీరు పేలవంగా ఉన్న ఎవరైనా సరే తీరు మార్చుకోవాల్సిందేనని చెప్పారు. ప్రస్తుతం ఉన్న నివేదికలను పరిశీలిస్తే ఎమ్మెల్యేలు, నేతల పనితీరు ఇంకా మెరుగు పడాల్సి ఉందన్నారు. కార్యకర్తలు జెండా మోసి పార్టీని అధికారంలోకి తీసుకు వచ్చారని, వారి సంక్షేమం కోసం పార్టీ కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు రవికుమార్, సత్యప్రసాద్, బాలవీరాంజనేయస్వామి, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మె ల్యేలు ఏలూరి సాంబశివరావు, నరేంద్రవర్మ, కొండయ్య, ఆనంద్‌బాబు పాల్గొన్నారు.

కొటేషన్లతో.. కొట్టేశారు

సబ్సిడీ యంత్రాల్లో కమీషన్ల మోత





- కొండెక్కిన వ్యవసాయ యంత్రాల ధరలు
- గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాలకు రూ.8.56 కోట్లు
- సబ్సిడీ నిధుల్లో అధికారుల జేబుల్లోకి 12 శాతం?
- స్ప్రేయర్ ధర రూ.21 వేలు.. రూ.27 వేలకు బిల్లు

గుంటూరు సిటీ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఎవరైనా ఏక మొత్తంగా ఏదైనా వస్తువులు కొనుగోలు చేస్తే వాటి ధర తగ్గుతుంది. ఇక తయారీ సంస్థలనే నేరుగా సంప్రదిస్తే మరింతగా ధర తగ్గుతుంది. అదే ప్రభుత్వం అనుకుంటే ఇంకా తగ్గాలి. కానీ అదేమిటో కానీ విచిత్రంగా బహిరంగ మార్కెట్లోని ధర కంటే పెరిగిపోతోంది. అధికారుల కమీషన్ల మాయతో ధరలను పెంచేసి లబ్ధిదారులపై భారం మోపుతున్నారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేస్తున్న సబ్సిడీ యంత్రాల పరిస్థితి ఇలాగా ఉంది. రైతు నేరుగా వెళ్లి కొనుగోలు చేస్తే అదే యంత్రం తక్కువ ధరకు వస్తుంది. అదే వ్యవసాయ శాఖ సబ్సిడీ ద్వారా అంటే రేటు కొండెక్కుతోంది. ఉదాహరణకు తైవాన్ పవర్ స్ప్రేయర్లు మార్కెట్‌లో రూ.21 వేల నుంచి రూ.22 వేల వరకు దొరుకుతున్నాయి. వాటి ధరను వ్యవసాయ శాఖ రూ.27 వేల వరకు నిర్ణయించింది. మండల స్థాయి నుంచి కమిషనరేట్ వరకు కమీషన్లు కలుపుకోవడంతో ఒక్కో యంత్రం ధర రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు పెరిగింది. 50 శాతం సబ్సిడీ పేరుతో అధికారులు జేబులకు చిల్లు పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లో సబ్సిడీపై వ్యవసాయ యంత్రాలు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం రూ.8.56 కోట్లు మంజూరు చేసింది. గుంటూరు జిల్లాకు మొత్తం 1727 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, సబ్సిడీ నిమిత్తం రూ.2.91 కోట్లను కేటాయించింది. పల్నాడు జిల్లాలో 1715 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా సబ్సిడీ నిమిత్తం రూ.2.80 కోట్లు కేటాయించారు. బాపట్ల జిల్లాలో 1719 వ్యవసాయ యంత్రాలు మంజూరు చేయగా, రూ.2.85 కోట్లు సబ్సిడీగా కేటాయించారు.

జీఎస్టీ పేరు చెప్పి..

సబ్సిడీ యంత్రాల ధరలు పెరగడానికి అధికారులు కొత్త భాష్యం చెబుతున్నారు. జీఎస్టీ కారణంగానే ధరల్లో తేడా ఉన్నట్లు పేర్కొంటున్నారు. ఏపీ ఆగ్రోస్‌కి రెండు శాతం చెల్లించాల్సి వస్తుందంటున్నారు. అయితే అధికారులు చెబుతున్న కారణాలను రైతులు పట్టించుకునే పరిస్థితిలో లేరు. సబ్సిడీ పేరుతో అధికారులు అవినీతితో తమను దోచుకుంటున్నారని ఆరోపిస్తున్నారు.

మార్కెట్లో తక్కువ ధర..

ప్రభుత్వం రైతులకు అండగా ఉండేందుకు సబ్సిడీపై ఏవైతే యంత్రాలు ఇస్తామని చెబు తుందో ఆయా యంత్రాలు బహిరంగ మార్కె ట్‌లో చాలా తక్కువ ధరకు వస్తున్నాయి. ఉదాహరణకు రోటావేటర్ మార్కెట్ ధర రూ.1.15 లక్షల వరకు ఉండగా, సబ్సి డీ ధర రూ.1.45 లక్షలుగా నిర్ణయించారు. మిగిలిన యంత్రాలు విలువ కూడా మార్కెట్‌లో చాలా తక్కువగా ఉన్నా సబ్సిడీ పేరు చెబితే ఎక్కువ చెబుతున్నారు. సబ్సిడీ యంత్రాలు సరఫరా చేసేందుకు అధికారులు రాష్ట్ర స్థాయిలో కొటేషన్లు ఆహ్వానించగా ఆ సమయంలోనే కమీషన్లు నిర్ణయం జరిగిందని సమాచారం. దీంతో యంత్రాలకు అసలు ధరకు మించి కొటేషన్లు ఇవ్వాలని ముందుగానే అధికారులు వ్యాపారులకు సూచించినట్లు తెలుస్తుంది. అసలు ధర కన్నా కనీసం 12 శాతం ఎక్కువగా కొటేషన్లు ఉండాలని నిర్ణయించారు. దానికి అనుగుణంగా కొటేషన్లు ఇచ్చిన వారికి మాత్రమే యంత్రాల సరఫరాకు అవకాశం దక్కినట్లు తెలుస్తుంది. వ్యవసాయ యంత్రాల కొనుగోలులో మిగులు సొమ్మును ఎవరికి ఎంత పంపాలన్న దానిపై కూడా పూర్తిగా ఒప్పందం జరిగినట్లు సమాచారం. కింద స్థాయిలోని అధికారుల నుంచి వ్యవసాయ శాఖ కమిషనరేట్‌లో ఉన్న కొందరు అధికారులకు చేరేలా ప్రణాళికలను రూపొందించారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

- భూసారం, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుదల
- లబ్ధిదారులకు పింఛన్లు అందజేసిన కలెక్టర్ అరుణ్‌బాబు

దుర్గి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయ విధానాలతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ అరుణబాబు తెలిపారు. మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ప్రారంభించిన కలెక్టర్ స్వయంగా లబ్ధిదారుల గృహాలకు వెళ్లి అందజేశారు. ఈ సందర్భంగా ధర్మవరం గ్రామంలో కోటిరెడ్డి అనే రైతు


రైతు కోటిరెడ్డి పొలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

ప్రకృతి వ్యవసాయ విధానంతో సాగు చేస్తున్న పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు. ప్రకృతి వ్యవసాయ విధానాలతో సాగు చేస్తున్న క్యారెట్, బీట్‌రూట్, ముల్లంగి, ఉల్లి, కొత్తిమీర, గోంగూర, పాలకూర, చుక్కకూర, తోటకూర తదితర 18 రకాల పంటలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో భూసారం, నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందన్నారు. పంటలకు కావాల్సిన పోషకాలన్నీ నేల నుంచి అందడానికి సాధ్యమవుతుందన్నారు. రసాయనిక ఎరువులు, పురుగుమందుల అవశేషాలు లేని ఆరోగ్యకరమైన దిగుబడులకు అవకాశం కలుగుతుందన్నారు. అనంతరం మండలంలోని ఓబులేశునిపల్లెలో నీటి తొట్టెలకు శంకుస్థాపన చేశారు. పశువుల సంఖ్యను దృష్టిలో పెట్టుకుని గ్రామానికి ఒక తొట్టిని ఏర్పాటు చేయాలన్నారు. దుర్గిలోని ఆచార్య నాగార్జున శిల్ప కళా శిక్షణా కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. కేంద్రంలో శిక్షణ గురించి నిర్వాహకులు చెన్నుపాటి శ్రీనివాసాచారి, సీతారామయ్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్‌డీఏ అధికారి ఝాన్సీరాణి, ఆర్డీవో మురళీకృష్ణ, డ్వామా పీడీ సిద్ధలింగమూర్తి, మండల ప్రత్యేకాధికారి గబ్రునాయక్, తమ్మాజీరావు, తహసీల్దార్ ఫణికుమార్, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జి వాణి, ఐసీఆర్‌పీ ప్రసన్నలక్ష్మి, ఏవో అమ్మిరెడ్డి, ఏఈ గోపాల్‌సింగ్, వెటర్నరీ అధికారి దిలీప్, సీసీలు అమర్, చంద్రయ్య, శ్యాంసన్, కార్యదర్శి కృష్ణ, వీఆర్వో వెంకటేశ్వర్లు, వెల్ఫేర్ అసిస్టెంట్ సుజాత పాల్గొన్నారు.

స్వగృహం.. శిథిలం

- నరసరావుపేటలో రూ.25 కోట్లతో నిర్మాణం
- పాడుబెట్టడం కన్నా.. వినియోగించడం మిన్న
- జిల్లా కార్యాలయాలకు కేటాయించేందుకు చర్యలేవీ
- రూ.లక్షలతో అద్దె భవనాల్లో కార్యాలయాల నిర్వహణ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రమైన నరసరావుపేటలో రాజీవ్ స్వగృహ భవనాలను పాడుబెడుతున్నారు. రూ.25 కోట్లు కుమ్మరించి నిర్మించిన బహుళ అంతస్తుల భవనాలు శిథిలావస్థకు చేరుకుంటున్నా పాలకులు పట్టించుకోవడంలేదు. ఎస్పీ కార్యాలయానికి కూత వేటు దూరంలో ఉన్న ఈ భవన సముదాయాలను మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. జిల్లా ఏర్పాటైన సమయంలో 2022లో ప్రభుత్వ కార్యాలయాలకు ఈ స్వగృహ భవనాలను వినియోగించుకోవాలని అధికారులు నిర్ణయించారు. కొన్ని ప్రభుత్వ కార్యాలయాలకు కూడా కేటాయించారు. వసతుల ఏర్పాటు కోసం నిధుల విడుదల చేయాలని నాటి ప్రభుత్వానికి ప్రతిపాదనలు కూడా పంపారు. అయితే వాటిని బుట్టదాఖలు చేశారు. దీంతో జిల్లా కార్యాలయాలను అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. సచివాలయంలో ఇటీవల జరిగిన కలెక్టర్ల సదస్సులో కలెక్టర్ అరుణ్‌బాబు స్వగృహ భవనాల అంశాన్ని ప్రస్తావించారు. వీటి వినియోగంపై స్పష్టత ఇవ్వాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. 2009లో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రాజీవ్ స్వగృహ పథకం కింద నరసరావుపేటలో లింగంగుంట్ల కాలనీలో నీటి పారుదల శాఖ స్థలంలో బహుళ అంతస్థుల నిర్మాణాలను చేపట్టారు. రూ.70 కోట్లతో మూడు బ్లాక్‌ల్లో 672 గృహాలను అపార్ట్‌మెంట్ల తరహాలో నిర్మించాలని నిర్ణయించారు. అప్పట్లో ప్రభుత్వం నుంచి అరకొరగా నిధులు విడుదల కావడంతో మూడు బ్లాకుల్లో 252 ఫ్లాట్లను నిర్మించారు. వీటిలో 168 డబుల్ బెడ్‌రూమ్ ఫ్లాట్లు, 84 సింగిల్ బెడ్ రూమ్ ఫ్లాట్లు ఉన్నాయి. డబుల్ బెడ్ రూమ్ ఫ్లాట్ ధరను రూ.11.60 లక్షలుగా, సింగిల్ బెడ్‌రూమ్ ఫ్లాట్ రూ.7.90 లక్షలుగా స్వగృహ కార్పొరేషన్ నిర్ణయించగా వాటి కొనుగోలుకు పట్టణవాసులు ఆసక్తి చూపలేదు. దీంతో అప్పటి నుంచి ఈ భవనాలు నిరుపయోగంగా మారాయి.

37 కార్యాలయాలకు కేటాయింపు..

వృథాగా పడి ఉన్న భవనాలను పల్నాడు జిల్లా ఏర్పాటుతో నరసరావుపేటకు వచ్చిన 37 జిల్లా కార్యాలయాల కోసం కేటాయించారు. ఖజానా, బీసీ వెల్ఫేర్ డీడీ, ఈడీ ఎస్సీ కార్పొరేషన్, ఈడీ గిరిజన సంక్షేమ శాఖ, సీపీవో ప్లానింగ్, సహకార శాఖ, డీడీ పౌరసరఫరాల శాఖ, డీఆర్‌డీఏ పీడీ, మున్సిపల్ పరిపాలన డీటీసీపీవో, మెప్మా పీడీ, ఉపాధి కార్యాలయం, వృత్తి విద్య, ఏడీ సెరీకల్చర్, డీడీ గ్రామీణ నీటి సరఫరా, పీడీ ఏపీఎంఐపీ, జీఎం పరిశ్రమల శాఖ, మైనార్టీ కార్పొరేషన్, ఏఈ ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయాలకు మొదటి బ్లాక్‌ను కేటాయించారు. రెండో బ్లాక్‌లో ఈఈ ఏపీఈడబ్ల్యూఐడీసీ, ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐఎస్, మైనింగ్ డీడీ, మినరల్ ఫైనాన్స్ కార్పొరేషన్, ఏపీ టిడ్కో ఈఈ, మార్క్‌ఫెడ్ డీఎం, దివ్యాంగుల సంస్థ ఏడీ, అగ్నిమాపక శాఖ, పశుసంవర్ధక శాఖ జేడీ, ఆత్మా పీడీ, ఉద్యాన శాఖ డీడీ, స్కిల్ డెవలప్‌మెంట్, ఆడిట్, వ్యవసాయ శాఖ జేడీ, బీసీ కార్పొరేషన్ ఈడీ, సీఈవో స్టెప్, యువజన సర్వీసుల శాఖ కార్యాలయలకు కేటాయించారు. ఈ మేరకు బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. కార్యాలయాలకు మౌలిక వసతుల కల్పనకు రూ.2.70 కోట్ల అంచనాతో అప్పట్లో కలెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. అయితే నిధులు విడుదల చేయకపోవడంతో ఈ భవనాల వినియోగాన్ని విరమించుకున్నారు. ఆయా కార్యాలయాలను అప్పటి నుంచి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు.


డబుల్ బెడ్‌రూమ్ అపార్ట్‌మెంట్లు

వసతులు కల్పిస్తే వినియోగించుకోవచ్చు

ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్‌కు గత ప్రభుత్వం ఆమోదం తెలిపింది. అయితే ప్రస్తుతం ఉన్న కలెక్టరేట్ పక్కనే నిరుపయోగంగా ఉన్న స్వగృహ భవనాలకు మౌలిక వసతులు కల్పిస్తే వినియోగించుకోవచ్చు. కొత్త భవనాలు నిర్మించే కన్నా ఉన్న భవనాలు వినియోగంలోకి తీసుకువస్తే ప్రభుత్వానికి రూ.కోట్లలో నిధులు ఆదా అవుతాయి. ఈ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేలు, ఎంపీ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి రవికుమార్ స్పందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు ఇస్తే జిల్లా కార్యాల యా లకు భవనాల సమస్య త్వరితగతిన పరిష్కారమవుతుంది.



ముగిసిన పది పరీక్షలు

- సోషల్ పరీక్షకు 99.04 శాతం హాజరు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా 128 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. చివరి రోజైన మంగళవారం సోషల్ పరీక్షకు జిల్లావ్యాప్తంగా 25,512 మంది విద్యార్థులకు 25,269 మంది 99.04 శాతం హాజరయ్యారు. ప్రైవేట్ విద్యార్థులు 104 మంది ఉన్నారు. జాయింట్ డైరెక్టర్ గీత చిలకలూరిపేట, నాదెండ్ల, నరసరావుపేట మండలాల్లోని ఏడు పరీక్షా కేంద్రాల్లో, డీఈవో చంద్రకళ నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు, యల్లమంద కేంద్రాల్లో తనిఖీలు చేశారు. జిల్లా పరీక్షల విభాగం అసిస్టెంట్ కమిషనర్ కేఎంఏ హుస్సేన్ నరసరావుపేటలోని నాలుగు కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు 45 కేంద్రాలను తనిఖీ చేసినట్లు డీఈవో తెలిపారు. ఈ పరీక్షల్లో ఎటువంటి మాల్ ప్రాక్టిస్ కేసులు నమోదు కాలేదన్నారు. పరీక్షలు ముగియడంతో విద్యార్థులు కేరింతలు కొడుతూ ఇళ్లకు చేరారు.

వర్సిటీలో కోర్సుల రద్దుపై ఉద్యమిస్తాం

విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

పెదకాకాని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో పలు కోర్సులను రద్దుచేస్తున్నట్లు ఈసీ కమిటీ సమావేశంలో తీర్మానించడం అత్యంత బాధాకరమని, దీనిపై పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్, రీసెర్చ్ పరిరక్షణ జేఏసీ నాయకులు తెలిపారు. మంగళవారం వర్సిటీలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ



వర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల జేఏసీ నాయకులు

యూనివర్సిటీ అధికారులు పత్రికాముఖంగా తెలియజేసిన ప్రకటన ద్వారా ఎల్‌ఎల్‌ఎంలో కొన్ని కోర్సులను ఈ విద్యా సంవత్సరం నుంచి నిలిపివేస్తున్నట్లు వార్తలను చదివి దిగ్భ్రాంతికి లోనయ్యామన్నారు. దశాబ్దాల చరిత్ర కలిగిన మన విశ్వవిద్యాలయ న్యాయవిభాగం ద్వారా ఎందరో పేద,గ్రామీణ విద్యార్థులు ఇక్కడ న్యాయ శాస్త్రం అభ్యసించి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి స్థాయికి చేరుకున్న సంగతి మీకు విధితమేనని, గత కొన్ని రోజులుగా ఒక అధ్యాపకుని కారణంగా కుల వివక్ష నెపంతో వర్సిటీ ప్రతిష్టకు భంగం ఏర్పడింది కానీ అతనిపై ఏ చర్య తీసుకోలేని అధికారులు పేద విద్యార్థుల భవిష్యత్తును సమాధి చేయటం ఏమంత సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా కోర్సుల మూసివేత చర్యను మాని న్యాయవిభాగాన్ని బలోపేతం చేసేలాగా తద్వారా పేద, గ్రామీణ విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు గిరీష్, జీ శ్రీనివాసరావు, మధులత, సుజాత తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి జాతీయస్థాయి నాటికల పోటీలు

రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 10 ప్రదర్శనలు ఎంపిక

యడ్లపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం 22వ జాతీయస్థాయి నాటికల పోటీలు ఏప్రిల్ 4,5,6 తేదీలలో నిర్వహించనున్నట్లు తెలుగు నాటక పరిషత్‌ల సమ్మేళనం(వేదిక), యడ్లపాడు పుచ్చలపల్లి సుందరయ్య కళానిలయం అధ్యక్షులు డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబు తెలిపారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి ప్రదర్శనకు ఎంపికైన నాటికల వివరాలను ఆయన మంగళవారం వెల్లడించారు. యడ్లపాడులోని పుచ్చలపల్లి సుందరయ్య కళా ప్రాంగణంలోని ఎంవీ చౌదరి కళావేదికపై పండుగ వాతావరణంలో ఈ పోటీలను నిర్వహించనున్నట్లు చెప్పారు. మూడు రోజుల పాటు నిర్వహించనున్న ఈ పోటీలలో మొత్తం 10 నాటికలు ప్రదర్శితం కానున్నాయన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని వివిధ కళాపరిషత్‌ల వేదికలపై ప్రదర్శించబడి అవార్డులు పొందిన అత్యుత్తమైన నాటికలను పరిశీలించి ప్రదర్శనకు ఎంపిక చేయడం జరిగిందని సురేష్‌బాబు తెలిపారు.

పెరిగిన సంగం పాల అమ్మకపు ధరలు

పొన్నూరు టౌన్, ఏప్రిల్, 1 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ పాల అమ్మకపు ధరలు లీటరుకు రూ.2ల చొప్పున పెంచినట్లు ఎండీ పీ గోపాలకృష్ణన్ తెలిపారు. సంగం గోల్డ్ ప్లస్ అర లీటరు ప్యాకెట్ ధరను రూ.36 నుంచి 37కు, సంగం డోల్డ్ అర లీటరు ప్యాకెట్ ధరను రూ..35 నుంచి 36కు, టీ స్పెషల్ అరలీటరు ప్యాకెట్ ధరను రూ.34 నుంచి 35కు, ఎస్‌పీఎమ్ ప్యాకెట్‌ను రూ.31 నుంచి 32కు, టీఎం పాలను రూ.28నుంచి 29కు, డీటీఎం పాలు అరలీటరు రూ.26 నుంచి 27కు ధరలు పెంచినట్లు తెలిపారు. పెంచిన ధరలు సోమవారం నుంచి అమలులోకి వచ్చినట్లు మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ తెలిపారు.

ఆరు పళ్ల విభాగంలో కేసానుపల్లి ఎడ్లకు ప్రథమస్థానం

తెనాలి అర్బన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఎడ్ల బల ప్రదర్శనలో ఆరుపళ్ల విభాగంలో దాచేపల్లి మండలం కేసానుపల్లికి చెందిన నెల్లూరు రామకోటయ్య ఎడ్ల జత విజేతగా నిలిచింది. 15 నిమిషాల వ్యవధిలో 3986 అడుగుల దూరం బండ లాగి ప్రథమస్థానంలో నిలిచాయి. తెనాలి మార్కెట్ యార్డులో నిర్వహిస్తున్న ఎడ్ల బల ప్రదర్శన పోటీల్లో ఆరుపళ్ల విభాగంలో 14 జతల ఎడ్లు పోటీ పడ్డాయి. సూర్యాపేట జిల్లా కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డి ఎడ్ల జత 3900 అడుగుల దూరం లాగి ద్వితీయ స్థానం, ప్రకాశం జిల్లా ఆకివీడుకు చెందిన రైతు పూజితరెడ్డి ఎడ్ల జత 3772 అడుగుల దూరం లాగి తృతీయ స్థానం, సూర్యాపేట జిల్లా మేళ్లచెరువుకు చెందిన రైతులు గోవర్ధనరెడ్డి, రాయుడు సుబ్బారావుల కంబైన్డ్ ఎడ్లజత 3676 అడుగుల దూరం లాగి నాల్గో స్థానం, కృష్ణా జిల్లా యనమలకుదురుకు చెందిన రైతు కావ్యశ్రీ, మధుల ఎడ్ల జత 3600 అడుగుల దూరం లాగి ఐదో స్థానం, వేటపాలెంకు చెందిన రైతు శిరీషా చౌదరి, అనంతవరంకు చెందిన రైతు ఏలూరి సాంబశివరావు కంబైన్డ్ ఎడ్ల జత 3522 అడుగుల దూరం లాగి ఆరో స్థానం, కుక్కలవారిపాలెంకు చెందిన రైతు శివజ్ఞానేశ్వర రెడ్డి, మోక్షితరెడ్డి ఎడ్ల జత 3300 అడుగుల దూరం



విజేత కేసానుపల్లి ఎడ్లతో మంత్రి సత్యకుమార్, ఎమ్మెల్సీ ఆలపాటి

లాగి ఏడో స్థానం, యద్దనపూడికి చెందిన రైతు ఖాదర్ మస్తాన్, బోగాది పూర్ణ ఎడ్లజత 3094 అడుగుల దూరం లాగి ఎనిమిదో స్థానం, కోదాడకు చెందిన రైతు కొప్పుల శ్రీనివాసరెడ్డి, కుంచనపల్లికి చెందిన రైతు నిక్షిత్ రెడ్డిల కంబైన్డ్ ఎడ్ల జత 2850 అడుగుల దూరం లాగి తొమ్మిదో స్థానంలో నిలిచాయి. విజేతలకు (వరుసగా ప్రథమ నుంచి తొమ్మిదో స్థానం వరకు) దాతలు కొరటాల శ్రీరామమూర్తి కుటుంబ సభ్యులు రూ.50 వేలు, కొడాలి రమణబాబు రూ.40 వేలు, ఉయ్యూరు శ్రీనివాసరెడ్డి రూ.35 వేలు, ఆళ్ల సురేష్ రెడ్డి, రమేష్‌రెడ్డి, రూ.30 వేలు, బోడపాటి బసవేశ్వరరావు రూ.25 వేలు, వి-ఫర్నీచర్ రామమోహనరావు రూ.20 వేలు, శరణుబాబు రూ.15 వేలు, తాడేపల్లి సూర్యనారాయణమూర్తి రూ.12 వేలు, గుత్తా సోమశేఖర్ రూ.10 వేలు బహుమతులు అందజేశారు. మిగిలిన ఐదుగురు పార్టిసిపెంట్స్‌కు రూ.5 వేలు ప్రోత్సాహక నగదు అందించారు. విజేతలకు ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు బహుమతులు అందజేశారు.

పాల పోటీల్లో పెదరావూరు ఆవుకు ప్రథమ స్థానం

పాల పోటీలలో పెదరావూరు ఆవుకు ప్రథమ స్థానం లభించింది. పోటీల్లో 13మంది రైతులు తమ ఆవులను పోటీలకు తీసుకు వచ్చారు. పశు సంవర్ధక శాఖ అధికారుల పర్యవేక్షణలో సోమవారం పొదుగులను ఖాళీ చేయించారు. మంగళవారం ఉదయం, సాయంత్రం రెండు పూటల తీసిన పాలను కొలిపించగా పెదరావూరు రైతు పాలడుగు సురేంద్రకు చెందిన ఆవు 12.650 లీటర్ల పాలు అందించి ప్రథమ స్థానంలో నిలిచింది. గుంటూరు రైతు పసుపులేటి కృష్ణ ఆవు 10.450 లీటర్ల పాలు అందించి ద్వితీయ స్థానంలో నిలిచింది. మేడికొండూరు రైతు తుబాటి పవన్‌చౌదరి ఆవు 8.80 లీటర్లు, తెనాలి రైతు కంచర్ల సాంబశివరావు ఆవు 6.350 లీటర్ల పాలు అందించి కన్సోలేషన్ బహుమతి పొందాయి. పశు సంవర్ధక శాఖ అధికారులు అడుసుమల్లి మధుసూదనరావు, నరసింహారావు, పద్మావతి, నాగిరెడ్డి, విశ్రాంత అధికారి ఆలపాటి వెంకట్రామయ్య తదితరులు పోటీలను పర్యవేక్షించారు.



ప్రథమ స్థానం పొందిన ఆవుతో రైతు సురేంద్ర

రూ.2015 కోట్లకు చేరిన సంగం టర్నోవర్

చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్రకుమార్

పొన్నూరు టౌన్ (చేబ్రోలు), ఏప్రిల్, 1 (ఆంధ్రజ్యోతి) : సంగం డెయిరీ వార్షిక టర్నోవర్ రూ.2015 కోట్ల మైలురాయిని అధిగమించిందని చైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ తెలిపారు. వార్షిక టర్నోవర్ రూ.2015 కోట్లు అధిగమించిన సందర్భంగా మంగళవారం వడ్లమూడి సంగం డెయిరీలో విజయోత్సవాలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అనంతరం చైర్మన్ నరేంద్రకుమార్ మాట్లాడుతూ తాను 2వసారి సంగం డెయిరీ చైర్మన్ అయ్యేనాటికి రూ.200 కోట్లు మాత్రమే టర్నోవర్ ఉందన్నారు. నేడు పాల రైతులు, వినియోగదారుల ఆదరాభిమానాలు



సంగం డెయిరీలో కేక్ కట్‌చేస్తున్న చైర్మన్ నరేంద్రకుమార్, సిబ్బంది

పాలకవర్గం, అధికారులు, సిబ్బంది కృషి కారణంగా రూ. రెండు వేలకోట్ల మైలురాయిని అధిగమించామని తెలిపారు. రాబోయే రోజుల్లో రూ.2200 కోట్ల టర్నోవర్ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నట్లు తెలిపారు. ప్రస్తుతం రోజుకు 10.50లక్షల లీటర్ల పాలసేకరణ చేస్తున్నట్లు, రాబోయే రోజుల్లో రోజుకు అదనంగా లక్షన్నర లీటర్ల పాలు సేకరించేలా 14 కొత్త చిల్లింగ్ సెంటర్లను ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. గత ప్రభుత్వ హయాంలో తన పైన, సంగం డెయిరీ పైన వైసీపీ పాలకులు వేధింపులకు పాల్పడి అక్రమ కేసులు పెట్టి జైలు పాలు చేశారన్నారు. ప్రభుత్వం కుట్రలను ఉద్యోగులు, రైతులు సంఘటితంగా నిలిచి తిప్పికొట్టారన్నారు. రానున్న రోజుల్లో నూతన ఉత్పత్తులను మార్కెట్లో ప్రవేశపెట్టడమే కాకుండా విదేశాలకు సంగం ఉత్పత్తులను ఎగుమతి చేయనున్నట్లు నరేంద్రకుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎండీ పీ గోపాలకృష్ణన్, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సును దొంగిలించిన వ్యక్తి అరెస్టు



బస్సును దొంగిలించుకు వెళుతూ పట్టుబడిన నాగేశ్వరరావు

మేడికొండూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆగి ఉన్న బస్సును తీసుకెళుతున్న ఓ దొంగ బస్సును వేగంగా నడుపుతూ ముందు వెళు తున్న ఆటోను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు వలస కూలీలు గాయపడ్డారు. పేరేచర్ల సమీపంలో మంగళవారం జరిగిన ఈ ప్రమాదంలో గాయపడిన వారిని అంబులెన్స్‌లో గుంటూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వారిలో ఏడేళ్ల బాలుడు లక్ష్మీనారాయణకు తీవ్ర గాయాలు కాగా తుపాకుల జయమ్మ, సుబ్బారావు, మాణిక్యమ్మతో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరందరూ కర్నూలు జిల్లా నుంచి వలస కూలీలుగా మేడికొండూరు మండలం సరిపూడి గ్రామానికి వచ్చి పొలం పనులు చేసుకుంటూ జీవిస్తున్నారు. పొలం పనులకు వెళ్లి తిరిగి వస్తుండగా పేరేచర్ల సమీ పంలో బస్సు ఢీకొట్టటంతో ఆటో బోల్తా పడి గాయాలపాలయ్యారు. విషయం తెలుసుకున్న సీఐ షేక్ హాస్సేన్ సాహెబ్ ప్రమాద స్థలానికి చేరుకొని బస్సును వెంబడించి సత్తెనపల్లి సమీపంలోని లయోలా ఇంజనీరింగ్ కళాశాల వద్ద ఆపి ఆ వ్యక్తిని అదుపులోకి తీసుకొని స్టేషన్ తరలించారు.

ఆటోను ఢీకొట్టడంతో వలస కూలీలకు గాయాలు..

మేడికొండూరు పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు మండలపరిధిలోని ఎస్ఆర్ఐ కళాశాలకు చెందిన బస్సును డ్రైవరు మందులు కొనుగోలు చేసుకోవడానికి పేరేచర్ల జంక్షన్‌లో ఆపాడు. గుర్తు తెలియని వ్యక్తి వచ్చి బస్సును నడుపుకుంటూ తీసుకెళ్లినట్లు డ్రైవరు పోలీసులకు తెలిపాడు. మేడికొండూరు పోలీసులు పల్నాడు జిల్లా లయోలా ఇంజనీరింగ్ కళాశాల సమీపంలో బస్సును అదుపులోకి తీసుకొని దొంగను అరెస్టు చేశారు. బస్సు దొంగిలించిన వ్యక్తి జంగారెడ్డిగూడెంనకు చెందిన పొన్నవోలు నాగేశ్వరరావు అని పోలీసులు తెలిపారు. నాగేశ్వరరావుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

గంట వ్యవధిలో కేసు ఛేదించిన పోలీసులు

బస్సును దొంగిలించి వలస కూలీల ఆటోను ఢీ కొట్టి, పరారైన బస్సును గంట వ్యవధిలోనే మేడికొండూరు పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ సంఘటనతో అప్రమత్తమైన సీఐ నాగూర్ మీరా సాహెబ్, ఎస్ఐ ఖాజిబాబు తమ సిబ్బందితో కలిసి సత్తెనపల్లి వైపు పోలీస్ వాహనంతో హుటాహుటిన వెళ్లడంతో దొంగను గంట వ్యవధిలోనే పట్టుకున్నారు.

నేడు ఆలపాటి ప్రమాణ స్వీకారం



గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు- కృష్ణా జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం నుంచి శాసనమండలికి ఎన్నికైన మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ నేడు ప్రమాణస్వీకారం చేయనున్నారు. శాసన మండలి చైర్మన్ సమక్షంలో మధ్యాహ్నం 2 గంటలకు ప్రమాణస్వీకారం చేసేందుకు ముహూర్తం ఖరారైంది. ఆయనతో పాటు శాసన మండలికి ఎన్నికైన మిగతా ఎమ్మెల్సీలు కూడా అదే సమయంలో ప్రమాణస్వీకారం చేయనున్నట్లు తెలిసింది. వాస్తవానికి ఎమ్మెల్సీ ఎన్నికలు ఫిబ్రవరి 27న జరగ్గా కౌంటింగ్ ప్రక్రియ మార్చి 3న నిర్వహించగా భారీ మెజార్టీతో ఆలపాటి విజయం సాధించారు. అయితే ఇప్పటి వరకు ఆ స్థానంలో కొనసాగుతున్న లక్ష్మణరావు పదవీకాలం మార్చి నెలాఖరు వరకు ఉండటంతో ఆలపాటి ప్రమాణస్వీకారం చేసేందుకు వీలుకాలేదు.

కృష్ణానదిలో యువకుడి గల్లంతు



రాజేష్ (ఫైల్‌ఫొటో)

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): అమరావతిలోని సాయిబాబా మందిరం సమీపంలోని కృష్ణానదిలో స్నానానికి వెళ్లి ప్రమాదవశాత్తు యువకుడు గల్లంతైన ఘటన మంగళవారం మధ్యాహ్నం జరిగింది. ప్రభుత్వ వైద్యశాల వెనుక వైపు ఉన్న కాలనీకి చెందిన నల్లకట్ల రాజేష్(19), మరో పదిమంది యువకులు కలసి చేపలు పట్టుకుని స్నానం చేసేందుకు కృష్ణానదిలోకి వెళ్లారు. వీరిలో రాజేష్ నదిలో మునిగి గల్లంతవడంతో మిగిలిన వారు బయటకు వచ్చారు. గల్లంతైన యువకుడి ఆచూకీ కోసం రెవెన్యూ, పోలీసు అధికారుల ఆధ్వర్యంలో గాలింపు చర్యలు చేపట్టారు.

రూ.9.67 లక్షల సిగరెట్లు సీజ్

మాచర్లటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చర్చిబజారులోని శ్రీవినాయక ఫ్యాన్సీ అండ్ జనరల్ స్టోర్స్‌లో రూ.9,67,300 విలువైన నిషేధిత సిగరెట్లను విజిలెన్స్ అధికారులు సీజ్ చేశారు.



సీజ్ చేసిన సిగరెట్లను పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగిస్తున్న అధికారులు

మంగళవారం స్థానిక రెవెన్యూ అధికారులతో కలిసి విజిలెన్స్ అధికారులు ఆ దుకాణంపై దాడులు చేశారు. సీజ్ చేసిన సిగరెట్లను పట్టణ పోలీస్‌స్టేషన్లో అప్పగించి ఫిర్యాదు చేశారు. దాడుల్లో డీసీటీవో రామారావు, ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఆర్ఐ ఇంటూరి అనిల్‌కుమార్, వీఆర్వోలు ఆరుమాళ్ల నాగేశ్వరరావు, అందుగుల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

1,11,203 మిర్చి టిక్కీల విక్రయం

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 1,16,035 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 1,11,203 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 53,345 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			షార్క్-1	10500	12400
334	9500	13000	బ్యాడిగి 355	10000	13200
నంబరు. 5	10000	13400	సింజెంటా		
273	10000	12900	బ్యాడిగి 5531	10500	12200
341	10500	14000	దేవనూరు డీలక్స్	10300	12700
4884	10000	11900	ఆర్మూరు	10000	11500
సూపర్ 10	--	--	తాలుకాయలు	5000	6500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ					
తేజ	10300	13600			

కన్న కొడుకే కాలయముడయ్యాడు

◆ కూలి డబ్బు కోసం వేధిస్తున్నాడు
◆ కాపాడమని పోలీసులను ఆశ్రయించిన వృద్ధ దంపతులు



వరకుమారి, చంద్రశేఖర్ దంపతులు

వేమూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రులకు అండగా ఉంటాడని, చివరి దశలో తలకొరివి పెడతాడని కొడుకుపై గంపెడాశలు పెట్టుకున్న ఆ వృద్ధ దంపతులకు ఇప్పుడు ప్రాణ భయం పట్టుకుంది. బాపట్ల జిల్లా, వేమూరు మండలం, పెరవలి గ్రామానికి చెందిన అమిరె వరకుమారి, చంద్రశేఖర్ వేమూరు పోలీస్‌స్టేషన్ వద్ద మంగళవారం విలేకర్లతో తమ గోడు వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమయ్యారు. తమ ఏకైక కుమారుడైన వీర బసవయ్య తమను బతికుండగానే చిత్రహింసల పాలు చేస్తూ చంపుతామని బెదిరిస్తున్నాడని, ప్రతినిత్యం తాగి వచ్చి తాము కూలి పనులు చేసుకున్న డబ్బు లు ఇవ్వమని కొడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు. కూలిపై ఆధారపడి జీవించే తాము బతుకుపై ఆశలు వదులుకునే పరిస్థితి ఏర్పడిందని, తమ కుమారుడిపై చర్యలు తీసుకోకపోతే తాము ఏ క్షణమైనా విగత జీవులవుతామన్నారు. న్యాయం జరుగుతుందనే చిరు ఆశతో ప్రాణభిక్ష కోసం పోలీసులను ఆశ్రయించామన్నారు. తమకు న్యాయం చేయాలని ఆ వృద్ధ దంపతులు వేమూరు పోలీసులను వేడుకున్నారు. ఈ విషయాన్ని విలేకరులు ఎస్ఐ దృష్టికి తీసుకురాగా విషయం తన దృష్టికి వచ్చిందని, విచారించి చర్యలు తీసుకుంటామని బాధితులకు తగు భద్రత కల్పిస్తామన్నారు.

గుంటూరు ఛానల్లో మునిగి యువకుడి మృతి



షేక్ జాని (ఫైల్)

పెదకాకాని, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్నేహితులతో కలిసి ఈతకు వెళ్లిన యువకుడు గుంటూరు ఛానల్లో మునిగి మృతిచెందిన సంఘటన మంగళవారం వెలుగు చూసింది. పెదకాకాని పోలీసుల కథనం ప్రకారం ఆర్టీసీ కాలనీ సమీపంలోని క్రాంతి నగర్‌కు చెందిన షేక్ జాని(18) అతని స్నేహితులైన మహమూద్, వంశీ, లోకేశ్ లతో కలిసి సరదాగా ఈత కొట్టేందుకు గుంటూరు ఛానల్‌కి వెళ్లారు. అక్కడ నీటితో దిగిన క్రమంలో జాని మునిగిపోయాడు. పక్కనే ఉన్న స్నేహితులు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ దొరకలేదు. కొద్దిసేపటికి మృతదేహాన్ని బయటికి తీశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని పోలీసులు తెలిపారు.

కొడుకును చంపిన తల్లి, తండ్రి అరెస్టు

ఫిరంగిపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఫిరంగిపురం గ్రామంలోని ప్రకాశం పంతులు కాలనీలో అద్దెకు ఉంటున్న కొండవీడు గ్రామస్థులైన కంచర్ల సాగర్, అతని రెండవ భార్య లక్ష్మీ తిరుపతమ్మ ఉరఫ్ లక్ష్మిలు కొడుకు కంచర్ల కార్తీక్‌ను గొంతు పిసికి చంపిన కేసులో తల్లిదండ్రులు ఇద్దరిని అరెస్టు చేశామని ఫిరంగిపురం పోలీసులు మంగళవారం తెలిపారు. నిందితులను మంగళవారం నరసరావుపేట రెండవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట హాజరు పరచగా వారిరువురికి ఈనెల 11వ తేదీ వరకు రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. కేసును సీఐ బీ రవీంద్రబాబు దర్యాప్తు చేస్తున్నారు.

నాలుగు రిటైల్ మందుల దుకాణాల లైసెన్స్‌ల రద్దు

● నర్సరావుపేటలో రూ.18.50 లక్షల మందుల సీజ్

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా గత పది రోజులుగా విజిలెన్స్ శాఖ, పోలీసు శాఖతో కలసి ఔషధ నియంత్రణ శాఖ అధికారులు చేపట్టిన తనిఖీలు కొనసాగుతున్నాయి. గుంటూరులో నాలుగు రిటైల్ మందుల దుకాణాలతో పాటు హోల్‌సేల్ మందుల దుకాణాలను అధికారులు తనిఖీలు చేశారు. హోల్‌సేల్‌షాపులో రికార్డులు సక్రమంగా ఉన్నట్లు గుర్తించారు. నాలుగు రిటైల్ మందుల షాపుల్లో రికార్డులు సరిగా లేకపోవంతో తాత్కాలికంగా ఆయా దుకాణాల లైసెన్స్‌లను వారం రోజుల పాటు రద్దు చేశారు. నర్సరావుపేటలో అనధికార గోడౌన్‌లో నిల్వ ఉంచిన రూ.18.50 లక్షల మందులను అధికారులు సీజ్ చేశారు. రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు "ఆపరేషన్ గరుడ" (ఎలైట్ యాంటీ నార్కోటిక్స్ గ్రూప్ ఫర్ లాఎన్‌ఫోర్స్‌మెంట్-ఈగల్) పేరిట మార్చి 21వ తేదీ నుంచి రాష్ట్రవ్యాప్తంగా మందుల దుకాణాలపై విజిలెన్స్ శాఖతో కలసి డ్రగ్ కంట్రోల్ అధికారులు ఆకస్మిక తనిఖీలు జరుపుతున్న విషయం తెలిసిందే. ఈ మత్తు మందులకు యువత బానిసలుగా మారుతున్నట్లు ఆరోపణలు రావడం, పలువురు రిటైల్ డ్రగ్గిస్టులు ఈ మందులను చట్టవిరుద్ధంగా విక్రయిస్తున్నట్లు ఆరోపణలు రావడంతో ఈ తనిఖీలు చేపట్టారు. దుకాణాలపై తనిఖీలు కొనసాగుతాయని గుంటూరు ఔషధ నియంత్రణ పరిపాలన శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డీ లక్ష్మణ్ తెలిపారు.

అవనిగడ్డ ప్రమాదంపై పెమ్మసాని ఆరా..

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): అవనిగడ్డ వద్ద రోడ్డు ప్రమాదానికి గురై మృతిచెందిన తెనాలివాసులు గిడుగు రవీంద్ర మోహన్ బాబు కుటుంబానికి పెమ్మసాని భరోసా ఇచ్చారు. ఢిల్లీలో ఉన్న ఆయన ప్రమాద ఘటన గురించి వార్తా కథనాల ద్వారా తెలుసుకుని మంగళవారం బాధితుల బంధువులకు ఫోన్ చేసి మాట్లాడారు. అధైర్యపడవద్దని వారికి ధైర్యం చెప్పారు. ప్రమాదఘటనపై, సత్వర చర్యలపై సబ్ కలెక్టర్ సంజనా సిన్హాకు పలు సూచనలు చేశారు. ఘటన జరగడానికి గల కారణాలను, అలాగే చికిత్స అందుతున్న విధానాన్ని వైద్యులను కూడా అడిగి తెలుసుకున్నారు. సందీప్, పల్లవిల ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని అయితే, తొడ ఎముకలకు ఫ్రాక్చర్ అయినందువల్ల సర్జరీ చేసే అవకాశం ఉందని ఆసుపత్రి వైద్యులు తెలిపారు. అనంతరం తెనాలిలోని బంధువులతో అక్కడి పరిస్థితిపై పెమ్మసాని ఆరా తీశారు. ప్రభుత్వం నుంచి సహకారం అందించేలా కృషి చేస్తానన్నారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తు గడువు పొడిగింపు

గుంటూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏపీ గురుకుల విద్యాలయాలు, మైనార్టీ గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు జిల్లా కన్వీనర్ ఐ. జయప్రకాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5,6,7,8, తరగతుల్లో మిగిలి ఉన్న ఖాళీలకు, జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం, డిగ్రీ కళాశాలలో మొదటి సంవత్సరం ప్రవేశాలకు ఈనెల 6వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ఏపీఆర్ఎస్ వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు. ఇతర వివరాల కోసం 87126 25073, 962569140లో సంప్రదించాలని సూచించారు.

73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి

● పీఎస్ గ్రేడ్- 4 నుంచి గ్రేడ్- 3గా బాధ్యతలు

గుంటూరు, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతి లభించిందని జిల్లా పంచాయతీ అధికారి బీ సాయికుమార్ తెలిపారు. 73 మంది పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు కల్పించడం కోసం మంగళవారం గుంటూరులోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జిల్లా పంచాయతీ అధికారి ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ జరిగింది. మొత్తం 73 మంది గ్రేడ్ -4 పంచాయతీ కార్యదర్శులు కౌన్సిలింగ్‌కు హాజరవగా వారిలో 53 మందికి గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. వారితోపాటు 21 మంది జూనియర్ అసిస్టెంట్లకు కూడా గ్రేడ్- 3 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి లభించింది.

సాగర్ ప్రాజెక్ట్ నీటి సమాచారం

విజయపురిసౌత్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నీటి మట్టం మంగళవారం నాటికి 519.10 అడుగులు ఉంది. ఇది 147.63 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 4050 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 6870 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1800, ఎల్ఎల్‌సీ ద్వారా 300 క్యూసెక్కులు, ఔట్ ఫ్లో వాటర్‌గా 13,020 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 2926 క్యూసెక్కుల

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.50 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	158, 167, 178
చికెన్ విత్ స్కిన్(కిలో)	306.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	316.00

గత ఏడాది కన్నా కోటి పన్ను వసూలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పిడుగురాళ్ల పురపాలక సంఘం 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.5 కోట్లు ఆస్తిపన్ను వసూలు జరిగినట్లు కమిషనర్ పీ శ్రీధర్ తెలిపారు. గత ఏడాది మార్చి ఆఖరు నాటికి రూ.4 కోట్లు వసూలు కాగా, ఈ ఏడాది రూ.5 కోట్లు వసూలైనట్లు కమిషనర్ వివరించారు. వడ్డీపై 50 శాతం రాయితీ ప్రకటించిన నాటి నుండి రూ.15 లక్షలు, మార్చి 31 చివరి ఒక్కరోజు రూ.21 లక్షల పన్ను వసూలైనట్లు కమిషనర్ తెలిపారు. గత ఏడాది కన్నా ఈ ఏడాది మార్చి ఆఖరునాటికి కోటి రూపాయలు ఆస్తిపన్ను అధికంగా వసూలు చేసినట్లు కమిషనర్ తెలిపారు.

నాగులగుడిలో వసంత నవరాత్రులు


ప్రత్యేక అలంకరణలో సరస్వతిదేవి

పిడుగురాళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక నాగులగుడి దేవాలయంలో శ్రీ మహా సరస్వతి అమ్మవారికి మంగళవారం సహస్ర నామార్చన, పంచామృతాభిషేకం, పసుపు, కుంకుమ, పన్నీరు, గంధంతో అభిషేకం, సామూహిక కుంకుమార్చన కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. పట్టణంలోని పలువురు మహిళలు అధికసంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దేవస్థానం అధ్యక్షుడు గుడె నాగ సతీష్, అర్చకులు గుంటుపల్లి వెంకటేశ్వరశర్మ, భక్తులు పాల్గొన్నారు.

కూర్మావతారంలో కోదండరాముడు

మాచర్లటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఉన్న శ్రీకోదండ రామాలయంలో మంగళవారం శ్రీరామనవమిని పురస్కరించుకొని స్వామిని కూర్మావతారంలో అలంకరించారు. అర్చకుడు వేణుగోపాలాచార్యులు ప్రత్యేక పూజలు జరిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బచ్చు రామారావు, కొత్తూరి వెంకటబాలకోటేశ్వరరావు, కోశాధికారి బవనారి లోకనాథకోటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చీదెళ్ల ఆంజనేయులు పాల్గొన్నారు.

ఏపీవో జయచంద్ర బదిలీ

రెంటచింతల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో ఏపీవోగా పనిచేస్తున్న జయచంద్రను దాచేపల్లికి బదిలీ చేస్తూ డ్వా మా పీడీ సిద్ధా లింగమూర్తి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఇక్కడ 3 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారు. ఆయన స్థానంలో దుర్గి ఏపీవోగా పనిచేస్తున్న వెంకటేశ్వర్లును నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

పింఛన్‌ల పంపిణీ

సత్తెనపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అన్ని వార్డుల్లో మంగళవారం ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌ల పంపిణీ కార్యక్రమం ముమ్మరంగా జరిగింది. సచివాలయ ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు పథకంలో భాగంగా వృద్ధులకు, దివ్యాంగులకు, ఒంటరి మహిళలకు పింఛన్‌లను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఆదేశాల మేరకు ఆయా వార్డుల్లో టీడీపీ నేతలు అధికారులతో పాటు పింఛన్‌ల పంపిణీలో పాల్గొన్నారు.

తొలి రోజు 94 శాతం పంపిణీ

నకకరికల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : మండలంలో తొలి రోజు మంగళవారం 94 శాతం మందికి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లు అందజేసినట్టు ఎంపీడీవో జీ కాశయ్య తెలిపారు. నకరికల్లులో పింఛన్‌ల పంపిణీ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ కేవీఎస్ ప్రసాదుతో పాటు వెల్ఫేర్ అసిస్టెంట్‌లు శాంతి, ప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

జూట్ ఉత్పత్తుల తయారీపై అవగాహన

పిడుగురాళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కొండమోడు ఎంపీపీ స్కూల్ నందు నెల రోజుల జూట్ ఉత్పత్తుల తయారీ శిక్షణ తరగతులను సీఎస్ఆర్ సీనియర్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ ముండూరు వెంకటరమణ మంగళవారం పరిశీలించారు. జూట్ తయారీలో మెళకువలు, శిక్షణ శిబిరంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, బ్యాగ్‌ల తయారీ నాణ్యతను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో శిక్షకురాలు దుర్గ, కేఎస్ఆర్ విద్యా సంస్థల డైరెక్టర్లు కోనేటి నరసింహారావు, మస్తాన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులు కాలువ నీటిని సద్వినియోగించుకోవాలి

నకకరికల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): సాగర్ కుడి కాలువ ద్వారా వివిధ బ్రాంచ్ కెనాల్స్‌కు విడుదల అవుతున్న సాగు నీటిని సక్రమంగా వినియోగించుకోవాలని ఓఅండ్ ఎం డీఈఈ జే శ్రీనివాసులు రైతులను కోరారు. మంగళవారం బుగ్గవాగు నుంచి 3200 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారని, గుంటూరు బ్రాంచ్ కెనాల్‌కు 900, అద్దంకి బ్రాంచ్ కెనాల్‌కు 740, బెల్లంకొండ బ్రాంచ్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు నీటి విడుదల చేసినట్టు తెలిపారు. చేజర్ల హెడ్ రెగ్యులేటర్ నుంచి కుడి కాలువకు 800 క్యూసెక్కులు దిగువకు వెళ్తున్నట్టు ఏఈ శివయ్య తెలిపారు. తాగునీటి అవసరాల నిమిత్తం నరసరావుపేట ఓవర్ హెడ్ ట్యాంక్‌కు 20 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్టు వివరించారు.

శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మాచర్లటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): శాఖాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని హైదరాబాద్ పిరమిడ్ గ్రాండ్ మాష్టర్ లక్ష్మీ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన మహాకరుణ శాఖాహార ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. మాంసాహారం తినడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో కేపీ సిద్ధంరాజు, చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు, కూలీలకు.. ఉపాధి పనులు వరం

- గ్రామాల్లో ఇంకుడు గుంతలు.. పొలాల్లో సేద్యపు కుంటల తవ్వకాలు
- 1.94 లక్షల పని దినాలు టార్గెట్
- గరిష్టంగా రూ.300.. పనిని బట్టి కూలీ


వేమవరం పొలాల్లో సేద్యపు కుంటలు తీస్తున్న కూలీలు


పంట కాలువల్లో పూడిక తీస్తున్న కూలీలు


గ్రామాల్లో ఏర్పాటు చేసుకున్న ఇంకుడు గుంతలు

మాచవరం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం అటు కూలీలకు, ఇటు రైతులకు వరంగా మారిందని చెప్పవచ్చు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో కూలీల జీనోపాధిని పెంపొందించేందుకు తీసుకువచ్చిన ఈ పథకం గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని వర్గాల ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. ముఖ్యంగా పొలాల్లో పిల్ల కాల్వలు, నీరు నిల్వ చేసుకొనేందుకు సేద్యపు కుంటలు, రైతులకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. గ్రామాల్లో మురుగు కాలువలు సక్రమంగా లేకపోవటం వల్ల వీధులు మురికి కుంటలుగా తయారవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఇంకుడు గుంతల పథకాన్ని తీసుకువచ్చి గ్రామాల్లో ఇంకుడు గుంతలకు యుద్ధ ప్రాతిపదికన శ్రీకారం చుట్టారు. మాచవరం మండలంలో ఒక్కొక్క గ్రామ పంచాయతీలో పది ఇంకుడు గుంతలు, 12 సేద్యపు కుంటలు తీయించాలని సంబంధిత అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాలను అధిగమించేందుకు గ్రామాల్లో రైతులు ఉత్సాహం చూపుతున్నారు. 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1.94 లక్షల పనిదినాలు టార్గెట్‌గా పెట్టుకున్నారని, ఇప్పటికే 1.65 లక్షల పని దినాలు పూర్తి చేశారని, మిగిలిన పని దినాలు మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తారని సంబంధిత అధికారులు తెలియజేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం కూలీల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని రోజుకు గరిష్టంగా మూడొందల చొప్పున ఇస్తామని, ఐతే పని చేసిన దానిని బట్టే కూలీ వస్తుందని అధికారులు చెపుతున్నారు. గరిష్టంగా రూ.260 నుంచి రూ.270 వరకు చేసిన పనిని బట్టి కూలీ వస్తుందని అధికారులు తెలియజేస్తున్నారు. ప్రస్తుతం రైతుల పొలాల్లో పనులు ముమ్మరంగా ఉండటం వల్ల కూలీలు రోజుకు నాలుగు వందల మంది వరకు వస్తున్నారని, ఏప్రిల్, మే నెలలో రోజుకు 1500 నుంచి రెండు వేల వరకు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. పని ప్రదేశాల్లో అన్ని రకాల వసతులు కూడా ఏర్పాటు చేశారని, ఎండ తీవ్రతను బట్టి టెంట్లు, మంచి నీటి వసతి, ఫస్ట్ ఎయిడ్ బాక్సులు, మజ్జిగ ప్యాకెట్లు కూడా కూలీలకు సరఫరా చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మొత్తం మీద గ్రామీణ ప్రాంతాల్లో జాతీయ ఉపాధి హామీ పథకం ఇటు రైతులకు, అటు కూలీలకు వరంగా మారిందని చెప్పవచ్చు.

ఏప్రిల్, మేలో కూలీల సంఖ్య పెరుగుతుంది

- ఏపీవో వెంకటేశ్వర్లు



ప్రస్తుతం రైతుల పొలాల్లో పనులు ముమ్మరంగా ఉండటం వల్ల ఉపాధి పనులకు కూలీలు ఆశించిన రీతిలో రావటం లేదు. ఏప్రిల్, మే నెలల్లో కూలీల సంఖ్య విపరీతంగా పెరుగుతుంది. రోజుకు 1500 నుంచి రెండు వేల వరకు వస్తారు. వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకొని కూలీలకు పని ప్రదేశంలో వివిధ రకాల వసతులు ఏర్పాటు చేస్తాం. ఎప్పటికప్పుడు పని ప్రదేశానికి వెళ్లి పనులను పర్యవేక్షిస్తాం.

గరిష్టంగా రూ.270 కూలీ పడుతుంది

- సీనియర్ మేటు జానీ బాషా



ప్రస్తుతం ప్రభుత్వం రూ.300ల కూలీ ప్రకటిం చింది. చేసిన పనిని బట్టి కూలీలకు రూ.270 వరకు కూలీ పడుతుంది. వేమవరంలో ఇంకుడు గుంతలు, సేద్యపు కుంటలు తీసుకొనేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. పని ప్రదేశం వద్ద కూలీలకు కావాల్సిన వసతులు కూడా ఏర్పాటు చేస్తున్నాం.

రాష్ట్ర స్థాయి పశు బల ప్రదర్శనలో రవికుమార్ యూత్ ప్రథమం


మొదటి స్థానం సాధించిన ఎడ్ల జతల యజమానులకు బహుమతులు అందజేస్తున్న ఎస్ఐ

బెల్లంకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బెల్లంకొండ మండలం కందిపాడు గ్రామంలో శ్రీవెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం సందర్భంగా జరిగిన రాష్ట్ర స్థాయి పశు బల ప్రదర్శనలో రెండు పళ్ళ విభాగంలో మొదటి స్థానం గొట్టిపాటి రవికుమార్ యూత్, చిరుకూరు నాగేశ్వరరావు, బెల్లంకొండ మండలం మాచాయపాలెం గ్రామానికి చెందిన గౌరు కార్తికేయ కంబైన్డ్ ఎడ్ల జాత 4,200 అడుగులు లాగి మొదటి స్థానం సాధించింది. నరసరావుపేట మండలం ఇస్సపాలెం గ్రామానికి చెందిన వెంకట రామాంజనేయులు ఎడ్ల జత 4,168.7 అడుగులు లాగి రెండో స్థానం సాధించింది. క్రోసూరు మండలం పెరికపాడుకి చెందిన కందుల ఆదిలక్ష్మి, ప్రకాశం జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకి చెందిన ఏలూరి లిఖిత చౌదరి కంబైన్డ్ ఎడ్ల జత నాలుగు వేల అడుగులు లాగి మూడో స్థానం సాధించింది. అమరావతి మండలం జిడుగు గ్రామానికి చెందిన భూపతి శ్రీనివాసరావు 3,802.10 అడుగులు లాగి నాలులో స్థానం సాధించింది. గుంటూరు జిల్లా తెనాలి సంగం జాగర్లమూడి గ్రామానికి చెందిన ముక్కంటి తేజ, శ్రీను సాద్విక్ ఎడ్ల జత 3,186 అడుగులు లాగి ఐదో స్థానం సాధించింది. బెల్లంకొండ మండలం నందిరాజుపాలెంనకు చెందిన బూతుకూరి సుబ్బారెడ్డి, క్రోసూరు మండలం అనంతవరం గ్రామానికి చెందిన కే భూలక్ష్మి కంబైన్డ్ ఎడ్ల జత 3,052.5 అడుగులు లాగి ఆరో స్థానం సాధించింది. కార్యక్రమానికి ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ ముఖ్యఅతిథిగా హాజరై గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులు అందజేశారు.

పశువుల దాహార్తి తీర్చేందుకు నీటి తొట్టెల నిర్మాణం

- మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి

సత్తెనపల్లి రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : వేసవి కాలంలో పశువుల దాహార్తిని తీర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నీటి తొట్టెల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని మార్కెట్ యార్డు చైర్మన్ కోమటినేని శోభారాణి అన్నారు. మండలంలోని నందిగామలో మంగళవారం నీటి తొట్టె నిర్మాణానికి ఆమె భూమి పూజ చేశారు. మండలంలోని నందిగామ, గర్నెపూడి, గుజ్జర్లపూడి, దీపాలదిన్నెపాలెం, గోరంట్ల, పెద మక్కెన, గుడిపూడి, ఫణిదం గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణం చేపట్టనున్నట్టు ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ వీవీ నారాయణ తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బలిజేపల్లి రమాదేవి, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి కోమటినేని శ్రీనివాసరావు, ఫీల్డ్ అసిస్టెంట్, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

● **మాచర్ల రూరల్, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని పశువేములలో మంగళవారం నీటి తొట్టెల పనులు ఎంపీడీవో ఫణికుమార్ ప్రారంభించారు. మండల పరిధిలో 32 నీటి తొట్టెలను ప్రారంభిచనున్నట్లు చెప్పారు. ఈ ఏడాది అన్ని గ్రామాల్లో అందరికీ ఉపాధి హామీ పనులు సిద్ధంగా ఉన్నాయని, 3.64 లక్షల పనిదినాలు లక్ష్యంగా ఉన్నట్లు చెప్పారు. కొప్పునూరు, కొత్తపల్లి గ్రామాల్లో ఏపీవో నాగశ్రీనివాస్ నీటి తొట్టెల పనులను ప్రారంభించారు. కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.


కారంపూడిలో నీటి తొట్టె నిర్మాణం శంకుస్థాపనలో అధికారులు

● **వెల్దుర్తి, (ఆంధ్రజ్యోతి):** మండలపరిధిలోని గ్రామాల్లో నేతలు, అధికారులు నీటి తొట్టెలు నిర్మాణ పనులను ప్రారంభించారు. మండలంలోని శిరిగిరిపాడులో టీడీపీ నేతలు కుర్రి శివారెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి చేతులమీదుగా ప్రారంభించార. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రసాదరావు, ఏపీవో రేఖాజ్యోతి, టీఏ నాగులనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● **కారంపూడి, (ఆంధ్రజ్యోతి):** మండలంలోని గ్రామాల్లో ఉపాధిహామీ పథకంలో భాగంగా ప్రతి గ్రామంలో పశువుల నీటి తొట్టె నిర్మాణానికి మంగళవారం అధికారులు భూమిపూజ నిర్వహించారు. పట్టణంలోని వినుకొండ రోడ్డులో గల గంగమ్మ గుడి వద్ద పశువుల నీటి తొట్టె నిర్మాణానికి ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, ఈవోపీఆర్డీ కసిన్యానాయక్ భూమిపూజ జరిపారు.

● **క్రోసూరు, (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని ఐదు గ్రామాల్లో నీటి తొట్టెల నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ అధికారులతో కలసి ఎంపీడీవో జీ శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. క్రోసూరులో రెండు ప్రదేశాల్లోను, గుడిపాడు, గరికపాడు, గాదేవారిపాలెం గ్రామాల్లో ఒక్కక్క ప్రదేశంలోను నిర్మాణాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు వెంకయ్య, టెక్నికల్ అసిస్టెంట్ వెంకటస్వామి, ఎన్ఆర్ఈజీఎస్ ఉద్యోగులు జానకీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

● **మాచవరం, (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని మోర్జంపాడులో పశువులకు నీటి తొట్టెల నిర్మాణం కోసం ఏపీవో వెంకటేశ్వర్లు శంకుస్థాపన చేశారు. ఒక్కొక్క గ్రామానికి రెండు నీటి తొట్లు మంజూరు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటేశ్వర్లు, టెక్నికల్ అసిస్టెంట్, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయాలి

సత్తెనపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఏప్రిల్ 2వ తేదీన ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రంలోని కలెక్టరేట్‌ల వద్ద ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో ఉపాధ్యాయులంతా పాల్గొని జయప్రదం చేయాలని ఉపాధ్యాయ సంఘాల రాష్ట్ర నాయకులు ఎస్ఎం సుభాని మంగళవారం కోరారు. జూలై 1, 2023 నుంచి ఇవ్వాల్సిన 12వ పీఆర్‌సీని ఏర్పాటు చేయాలని, ఐఆర్ 30 శాతం, బకాయి ఉన్న మూడు డీఏలు, రావాల్సిన ఎరియర్స్‌ను వెంటనే విడుదల చేయాలని కోరుతూ ధర్నా నిర్వహిస్తారన్నారు. ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలన్నారు.

ఎన్యూమరేటర్లకు శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో ఝాన్సీరాణి

కారంపూడి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): కారంపూడి మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం స్వయం సహాయక సంఘాలకు వార్షిక రుణ, జీవనోపాదుల ప్రణాళికలు తయారు చేయడంపై ఎన్యూమరేటర్లకు శిక్షణ నిర్వహించారు. ఏరియా సంచాలకులు ఝాన్సీరాణి ఈ సందర్భంగా ఎన్యూమరేటర్లకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు రాజమ్మ, పెన్షన్స్ ఏపీవో భరత్‌కుమార్, సీసీలు మల్లేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

వెల్దుర్తి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వెల్దుర్తి మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం టీడీపీ నేతలు, అధికారులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు కుర్రి శివారెడ్డి, కళ్లం రామాంజిరెడ్డి, ఎంపీడీవో ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ వేలం

మాచర్లటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పంచాయతీరాజ్ గెస్ట్‌హౌస్ నిర్వహణకు ఈనెల 11వ తేదీన బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు పంచాయతీరాజ్ డీఈ విభూషణ్ తెలిపారు. దరఖాస్తులను పంచాయతీరాజ్ శాఖా కార్యాలయంలో పొందవచ్చన్నారు. 2028 ఏప్రిల్ 10వ తేదీ వరకు నిర్వహణ హక్కు ఉంటుందన్నారు. మరిన్ని వివరాలకు 9440988904 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

ఆనాడు అరాచకం.. ఇప్పుడేమో నీతులా.. !


పట్టణ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల అరాచక పాలనలో గ్రామ గ్రామాన పార్టీ నేతలు అరాచకాలకు పాల్పడి భూఆక్రమణలు, మహిళలపై అత్యాచారాలు, దాడులకు పాల్పడిన నేతలు ఈనాడు నీతి వాక్యాలు వల్లించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని పార్టీ మండల కన్వీనర్ గండికోట వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి పణితి రవి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తురకా వీరస్వామిలు పేర్కొన్నారు. మంగళవారం పిడుగురాళ్ల పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ సోమవారం జూలకల్లులో జరిగిన ఘటనను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి టీడీపీ శ్రేణుల దాడులు ఎక్కువయ్యాయని, అభివృద్ధి కనిపించడం లేదని మాట్లాడటాన్ని ఖండిస్తూ 2019-24 మధ్య కాలంలో నియోజకవర్గంలో 11 మంది పార్టీ నేతల హత్య, వైసీపీ నేతల అక్రమ మైనింగ్‌కు 8 మంది చిన్నారులు బలయ్యారని గుర్తుచేశారు. జూలకల్లులో కొందరు వైసీపీ నేతలు అధికారంలో ఉండగా ఇళ్లమీదపడి దాడులు చేసి కాళ్లు, చేతులు విరగ్గొట్టినప్పుడు కాసు మహేష్‌రెడ్డి ఎందుకు మాట్లాడలేదని, వ్యక్తిగత గొడవలకు పార్టీ రంగు పులిమి మాట్లాడటం ఇకనైనా మానుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో కొండలు, డేవిడ్, వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ ఆంజనేయులు, యడ్లపల్లి శివ, శ్రీను, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఎలుకల నిర్మూలనకు రైతులు చర్యలు తీసుకోవాలి

నకకరికల్లు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎలుకల నిర్మూలన కోసం రైతులు గ్రోమోర్ డియోలిన్ విషపు ఎర తయారీ విధానాన్ని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వ విద్యాలయ పరిధిలో గల బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు తెలియజేశారు. మంగళవారం నకరికల్లు మండలం రూపెనగుంట్ల గ్రామంలోని రైతు సేవాకేంద్రం ఆవరణలో రైతులకు ఎలుకల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మాజీ ఎమ్మెల్యే కాసు రెచ్చగొట్టే వ్యాఖ్యలు

- తీవ్రంగా ఖండిస్తున్న కూటమి నేతలు

గురజాలటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గురజాల మాజీ ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి గురజాల సబ్‌జైల్లో రిమాండ్‌లో ఉన్న వైసీపీ నేతలను మంగళవారం పరామర్శించి బయటకు వచ్చి సబ్‌జైలు ఆవరణలోనే విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కాసు మహేష్‌రెడ్డి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడంతో అక్కడే ఉన్న వైసీపీ నాయకులు కార్యకర్తలు ఈలలు, కేకలు వేస్తూ వీరంగం సృష్టించారు. ఈ సందర్భంగా కూటమి నేతలు మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనలో గురజాల నియోజకవర్గంలో ఆటవికరాజ్యంగా మార్చింది చాలక దొంగ నాటకాలు మొదలు పెట్టారంటూ మండిపడ్డారు. మహేష్‌రెడ్డి వ్యాఖ్యలు ఖండించిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, కౌన్సిలర్లు నేలవల్లి బొల్లయ్య, చాగంటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలి

- మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సాల్మన్

మాచర్లటౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పురపాలక సంఘాల్లోని పారిశుధ్య, ఇంజనీరింగ్ విభాగాల్లో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారిని పర్మినెంట్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి సాల్మన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఉదయం కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులు మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నేత కొమెర రమణ, అనసూయ, గోగుల కళావతి, బత్తుల చిన్నమ్మాయి. కుమారి తదితరులు పాల్గొన్నారు.

పేరేచర్ల మీదగా గుంటూరుకు బస్సు సర్వీసులు

సత్తెనపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల కోరిక మేరకు ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం ఈనెల 2వ తేదీ బుధవారం నుంచి సత్తెనపల్లి డిపో నుంచి గుంటూరు వెళ్లే బస్సులు వయా పేరేచర్ల, పెద పలకలూరు, గుజ్జనగుండ్ల తాలూకా మీదగా రెండు సర్వీసులను తిప్పనున్నట్టు డిపో మేనేజర్ విజయకుమార్ మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ రూట్‌లో రెండు బస్సులు ఒక్కొక్కటి ఐదు ట్రిప్పులు వేస్తాయని ఆయన తెలిపారు. ఉదయం 6 గంటలకు సత్తెనపల్లిలో ఒక బస్సు, 7.25 గంటలకు మరో బస్సు పేరేచర్ల మీదుగా గుంటూరు వెళ్తాయని తెలిపారు. గుంటూరులో రాత్రి 7:05 గంటలకు ఒక బస్సు, 8:05 గంటలకు మరో బస్సు గుజ్జనగుండ్ల, పేరేచర్ల మీదుగా సత్తెనపల్లి చేరుకుంటాయని ఆయన తెలిపారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు.

ఉంగుటూరులో ఎమ్మెల్యే ప్రవీణ్ పింఛన్ల పంపిణీ


లబ్ధిదారులకు పెన్షన్ నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్

అమరావతి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఉంగుటూరు గ్రామంలో మంగళవారం పలువురు లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి వైపు రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తూ ప్రజల్లో కూటమి ప్రభుత్వంపై నమ్మకం కల్గిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి రాజగోపాల్, ఎంపీడీవో పార్వతి, సర్పంచ్ మేదరమెట్ల అనూరాధ, సోమశేఖర్, జగదీష్, రామమోహన్, ఎం విష్ణు, రామకృష్ణ, కోటేశ్వరరావుతో పాటు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ప్రజాదర్బార్

పెదకూరపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఈనెల 2వ తేదీ పెదకూరపాడులోని పంచాయతీరాజ్ అతిథి గృహం వద్ద జరిగే ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొంటారని ఎమ్మెల్యే కార్యాలయ ప్రతినిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలను ఎమ్మెల్యే స్వీకరిస్తారని వారు వివరించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

యడ్లపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో పదహారో నంబరు జాతీయరహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్తెనపల్లికి చెందిన ఆళ్ళ అజయ్ సోమవారం రాత్రి చిలకలూరిపేట నుంచి గుంటూరుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. యడ్లపాడు ఎర్రకొండ సమీపంలోకి రాగానే అదేమార్గంలో మద్యం తాగి తూలుతూ నడిచి వెళుతున్న గుర్తు తెలియని యువకుడిని ఢీకొట్టాడు. దీనితో ద్విచక్రవాహనం అదుపుతప్పి వంతెన గోడకు ఢీకొట్టగా వాహనంపై ఉన్న అజయ్ వంతెనపై నుంచి దిగువన ఉన్న సర్వీసురోడ్డుపై పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అజయ్‌ను గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, గుర్తు తెలియని యువకుడిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే ప్రమాదానికి గల కారణంపై స్పష్టత రాలేదని, యువకులు కోలుకున్న తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్ఐ తెలిపారు. గుర్తు తెలియని యువకుడు ఒరిస్సాకు చెందిన వలస కార్మికుడు అయి ఉండవచ్చని, నూలుమిల్లులో పనిచేస్తూ ఉండి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బాలకృష్ణ తెలిపారు.

తలుపులు పగలగొట్టి నగదు అపహరణ

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని ధరణికోట పంచాయతీ పరిధిలోని 14వ వార్డులోని కొండవీటినగర్‌లో ఓ ఇంట్లోని రెండు అంతస్తుల్లో ఎవరూ లేని సమయం చూసి తాళాలు పగలగొట్టి ఇండ్లలోని సుమారు రూ1.5లక్షల విలువైన నగదు, బంగారాన్ని అపహరించుకు పోయిన సంఘటన మంగళవారం వెలుగుచూసింది. కాలనీలో ఉంటున్న చల్లగరిగ వరలక్ష్మి తన కుమార్తెతో విశాఖపట్నంలో ఉంటూ అప్పుడప్పుడు వచ్చి వెళ్తోంది. ఇంటిపై అంతస్తులో స్థానిక ఇండియన్ బ్యాంకులో అసిస్టెంట్ మేనేజరుగా చేస్తున్న ఆర్ కవిత నివాసం ఉంటున్నారు. రంజాన్, ఉగాది సెలవులు కావడంతో గుంటూరులోని తన ఇంటికి వెళ్లింది. మంగళవారం డైరెక్ట్‌గా బ్యాంకుకు వచ్చి సాయంత్రం ఇంటికెళ్లి చూడగా ఇంటి తలుపులు పగలగొట్టి బీరువాలు తెరిచి ఉండటం, అందులోని బట్టలు, వస్తువులు చెల్లాచెదురుగా పడివుండటం గమనించింది. కింద ఇంటి ఓనరు ఉంటున్న ఇంటిలో కూడా తలుపులు పగలగొట్టి, బీరువాలు తెరిచి సామగ్రి చెల్లాచెదురుగా పడవేసి ఉన్నాయి. దీంతో ఆమె ఇంటి ఓనరుకు తెలియజేయడంతో ఆమె కూడా వచ్చి జరిగిన ఘటనకు సంబంధించి పోలీసులకు పిర్యాదు చేసింది. బ్యాంకు ఉద్యోగి బీరువాలో ఉన్న 60వేల నగదు, 8గ్రాముల బంగారం, కింద ఇంటిలో 8గ్రాముల బంగారం అపహరణకు గురైనట్లు గుర్తించారు. ఘటనా స్థలాన్ని సీఐ అచ్చయ్య, ఎస్ఐ రాజశేఖర్ పరిశీలించి బుదవారం ఉదయం క్లూస్ టీంను తెప్పించి విచారణ చేపట్టనున్నారు.

దొంగతనం కేసులో నిందితుడి అరెస్టు

అమరావతి, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి) మండలపరిధిలోని లింగాపురం గ్రామంలో గత నెల 13న షఫ్రక్ మీరాబీ ఇంటిలో దొంగతనం జరిగి 55గ్రాముల బంగారు నగలు,44వేల నగదు అపహరించుకుపోయారు. ఈ కేసుకు సంబంధించి గ్రామానికి చెందిన నాగేంద్రకుమార్ అనే యువకుడిని అనుమానితుడుగా బావించి ఎస్పీ ఆదేశాల మేరకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. మంగళవారం స్థానిక బస్టాండ్ సమీపంలో అనుమానాస్పదంగా తిరుగుతున్న నాగేంద్రకుమార్‌ను గుర్తించి అతనిని అదుపులోకి తీసుకుని అతని వద్దనున్న నగలను స్వాధీనం చేసుకున్నారు. అపహరించిన నగదు తన సొంత ఖర్చులకు వినియోగించినట్లు తెలుసుకుని నాగేంద్రకుమార్‌ను అరెస్టు చేసి సత్తెనపల్లి కోర్టులో హాజరుపరిచినట్లు సీఐ అచ్చయ్య తెలిపారు.

బోరు మోటార్లు చోరీ కేసులో ముగ్గురి అరెస్టు

మాచర్ల రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): బోరు మోటార్లు చోరీ కేసులో ముగ్గురిని మాచర్ల రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. మండలంలోని కంభంపాడు శివారులోని పొలాల్లో గత నెల 22వ తేదీన రెండు బోరు మోటార్లు చోరీకి గురయ్యాయి. బాధితులు 23వ తేదీన మాచర్ల రూరల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు తమ దర్యాప్తులో కంభంపాడు గ్రామానికి చెందిన ఆరికట్ల మణికంఠారెడ్డి, వీర్ల పెదవెంకట శివ, చల్లా రాజేష్‌లను నిందితులుగా గుర్తించారు. వీరిని మంగళవారం మండలంలోని రాయవరం జంక్షన్ వద్ద అదుపులోకి తీసుకొని రెండు మోటార్లను స్వాధీనం చేసుకున్నట్లు రూరల్ ఎస్ఐ పి.రవిబాబు తెలిపారు. నిందితులను మాచర్ల కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి ప్రశాంత్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ చెప్పారు.


తెనాలిలో ఆరు పళ్ళ విభాగంలో ప్రథమ స్థానం పొందిన ఎడ్ల జత యజమాని నెల్లూరి రామకోటయ్యతో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాదు, ఎమ్మెల్యే ఆనందబాబు

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ తరగతులు

బెల్లంకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ కమిషనర్ ఆదేశాల ప్రకారం ఏప్రిల్ 1 నుంచి 23వ తేదీ వరకు ద్వితీయ సంవత్సర విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఉమాదేవి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

సూర్యలంకలో సందడి

దీక్షల ముగింపుతో తీరానికి పోటెత్తిన ముస్లింలు



సూర్యలంక సముద్రతీరంలో స్నానాలు ఆచరిస్తున్న ముస్లిం సోదరులు, కుటుంబ సభ్యులు



చిన్నారులతో ముస్లిం పెద్ద



ఇసుకతో ఆటలాడుతున్న యువకులు



గజఈతగాళ్లతో గస్తీ నిర్వహిస్తున్న మెరైన్, రూరల్ పోలీసులు

బాపట్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతున్న సూర్యలంక సముద్రతీరం మంగళవారం ముస్లిం సోదరులతో పోటెత్తింది. నెలరోజులుగా ఉపవాసదీక్షలు చేసి రంజాన్ వేడుకను ఘనంగా జరుపుకున్న ముస్లింకుటుంబాలంతా కలిసి తీరానికి వచ్చి పుణ్యస్నానాలు ఆచరిస్తూ సంతోషంగా, సరదాగా గడిపారు. బాపట్ల పరిసరప్రాంతాలు నుంచే కాకుండా రెండు తెలుగురాష్ట్రాల నుంచి విచ్చేసిన భక్తులతో తీరం కిక్కిరిసింది. ఇసుక తిమ్మెర్లతో యువత ఆటలాడుతూ సందడి చేశారు. చిన్నారులను సైతం స్నానాలు చేయిస్తూ పెద్దలు కనిపించారు. ప్రత్యేక వాహనాలలో తరలి రావటంతో తీరం వెంట బారులు తీరి జనం ఉన్నారు. సుమారు 60వేలమంది వచ్చిఉంటారని పంచాయతీ అధికారులు పేర్కొన్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు పర్యాటకులు వస్తూనే ఉన్నారన్నారు. వాహనాల రాకపోకలతో అక్కడక్కడ కొన్ని అవాంతరాలు తలెత్తాయి. ట్రాఫిక్ సమస్యలు ఏర్పడ్డాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మెరైన్, రూరల్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గజ ఈతగాళ్ళు గస్తీ నిర్వహించి ప్రమాదాలు జరగకుండా చూశారు. గ్రామపంచాయతీ అధికారులు పర్యాటకులకు వసతులు కల్పించారు. తీరానికి విచ్చేసిన ముస్లిం సోదరులంతా కలిసి తీరం వెంట భోజనాలు చేసి సంతోషంగా గడిపారు. ప్రతి ఏడాది రంజాన్ వేడుక మరుసటి రోజు తీరానికి పర్యాటకులు రావటం పరిపాటిగా మారింది. ఈఏడాది అనుకున్న దానికన్నా ఎక్కువ సంఖ్యలో ముస్లిం సోదరులు తీరానికి తరలి వచ్చారు.

24 గంటలూ అందుబాటులో ఆర్థోపెడిక్ ఓటీ

గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): గుంటూరు వైద్య కళాశాల 1999వ బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థుల వితరణతో ప్రభుత్వ సమగ్రాస్పత్రి ఆర్థోపెడిక్ విభాగంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆపరేషన్ థియేటర్‌ను రూ.లక్షన్నరతో అభివృద్ధి చేశారు. రూ.లక్షతో వైద్యపరికరాలను సమకూర్చారు. రోడ్డు ప్రమాదాల్లో గాయపడి చికిత్స కోసం వచ్చే రోగులకు ఆర్థోపెడిక్ విభాగంలో ఈ ఆపరేషన్ థియేటర్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందని ఆర్థోపెడిక్ ప్రొఫెసర్, సూపరింటెండెంట్ డాక్టర్ రమణ యశస్వి తెలిపారు. కార్యక్రమంలో ఆర్థోపెడిక్ విభాగాధిపతి డాక్టర్ వీవీ నారాయణరావు, మత్తు విభాగాధిపతి డాక్టర్ పోలయ్య, ఎన్టీఆర్ వైద్య సేవ నోడల్ అధికారి డాక్టర్ అనిల్ పాల్గొన్నారు.



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న రమణ యశస్వి

ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీ హాల్ ఆధునికీకరణ...

గుంటూరు వైద్య కళాశాల పూర్వ విద్యార్థి, న్యూరోసర్జన్ డాక్టర్ ఉప్పుటూరి హేమంత్ జీఎంసీ ఫిజియాలజీ విభాగంలో లెక్చర్ గ్యాలరీ హాల్ ఆధునికీకరణకు తగిన ఆర్థిక సాయం చేసేందుకు ముందుకు వచ్చారు. ఇక్కడ వైద్య విద్యను అభ్యసించిన సమయంలో డాక్టర్ హేమంత్ ఫిజియాలజీ విభాగంలో గోల్డ్‌మెడల్ సాధించారు. ఈ నేపథ్యంలో ఈ విభాగం అభివృద్ధికి సాయం చేయాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్‌వీ సుందరాచారి కోరగా, డాక్టర్ హేమంత్ అంగీకరించారు. ఇప్పటికే ఫిజియాలజీ లెక్చర్ గ్యాలరీ హాల్‌లో అభివృద్ధి పనులు చేపట్టారు.

క్యాంటీన్ పనుల ప్రారంభం...

గుంటూరు వైద్య కళాశాలలో విద్యార్థులకు, వైద్య బోధన సిబ్బంది కోసం ఆధునిక రీతిలో క్యాంటీన్ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. తెలుగు సంవత్సరాది ఉగాది పర్వదినం నాడు ప్రిన్సిపాల్ సుందరాచారి పూజా కార్యక్రమాలతో నిర్మాణ పనులను ప్రారంభించారు. సుమారు రూ.40 లక్షలతో చేపడుతున్న ఈ క్యాంటీన్ నిర్మాణానికి 1993వ బ్యాచ్ పూర్వ విద్యార్థి, ప్రముఖ స్పైన్ సర్జన్ డాక్టర్ జే నరేష్‌బాబు వ్యక్తిగతంగా రూ.25 లక్షల ఆర్థిక సాయం అందజేస్తున్నారు.

అతిగా పురుగు మందుల వాడకం అనర్థం

● ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయ ఏడీఆర్ డాక్టర్ దుర్గాప్రసాదు

గుంటూరు(తూర్పు), ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పంటలో ఇష్టాను సారంగా పురుగుమందులు వినియోగించడంతో సరైన ఫలసాయం అందకపోగా ఖర్చు పెరుగుతుందని ఆచార్య ఎన్జీ రంగా విశ్వావిద్యా లయం అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ రిసెర్చ్(ఏ డి ఆర్) డాక్టర్ దుర్గాప్రసాదు అన్నారు. మంగళవారం ఎన్విరో ఈక్విటీ హెల్త్ ఇనిషియేటివ్ స్వచ్ఛంద సేవా సంస్థ, ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో రూరల్ మండలం జొన్నలగడ్డ గ్రామ రైతులకు పురుగు మందులు 'సురక్షితంగా వాడండి- ఆరోగ్యంగా ఉండండి' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు జొన్నకూటి శ్రీయ, వ్యవసాయ శాస్త్రవేత్తలు సాంబశివరావు, దయానాతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాదు మాట్లాడుతూ దిగుబడుల కోసం పురుగు మందుల వాడకం పెరిగిపోయిందని చెప్పారు. మిగిలిన దేశాల్లో సమగ్ర సస్యరక్షణ పాటిస్తారని, మన దేశంలో మాత్రం ఎలాంటి జాగ్రత్తలు పాటించకుండా పురుగుమందులు వాడుతున్నారని చెప్పారు. వ్యవసాయ రంగంలో త్వరలో డ్రోన్ టెక్నాలజీ రానుందని వెల్లడించారు. జొన్నకూటి శ్రీయ మాట్లాడుతూ పురుగు మందులు వాడకంలో జాగ్రత్తలు తీసుకోని పక్షంలో క్యాన్సర్, అలర్జీ, మెదడు, నరాల సంబంధమైన జబ్బులు తోపాటు గర్భంలో బిడ్డలకు కూడా ప్రమాదం పొంచి ఉందన్నారు. పురుగు మందులు వాడిన అనంతం డబ్బాలు భూమిలో పాతిపెట్టాలన్నారు. కార్యక్రమంలో జొన్నలగడ్డ మాజీ ఉపసర్పంచ్ వంగా నవీన్ రెడ్డి, లాం జనసేన పార్టీ నాయకులు ఎం సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ దుర్గాప్రసాదు, పాల్గొన్న జొన్నకూటి శ్రీయ, వంగా నవీన్‌రెడ్డి తదితరులు

ఇటుక పరిశ్రమకు గడ్డు పరిస్థితులు

కొల్లూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి రాష్ట్రంలో కొల్లూరు ఇటుక పరిశ్రమ ఎంతో ప్రసిద్ధి చెందింది. కొల్లూరు మండల పరిధిలోని కృష్ణానది పరివాహక ప్రాంతంలో దొరికే బుసకతో కూడిన మట్టి ఇటుక తయారీకి అనుకూలమైనది కావడంతో ఇక్కడ తయారయ్యే ఇటుకలు ఎంతో మన్నిక కలవని పేరు పొందాయి. అలాంటి పరిశ్రమ నేడు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటుంది. గతంలో ఈ ప్రాంతంలో సుమారు 180 ఇటుక పరిశ్రమలు ఉండగా నేడు అవి సగానికి పడిపోయాయి. ఇటుక తయారీకి వ్యయం పెరగడంతో పాటు అదే సమయంలో ఇటుక ధరలు తగ్గడంతో వ్యాపారులు నష్టాల పాలవడంతో ఈ ఏడాది ఇటుక ఉత్పత్తిని తగ్గించేశారు. కొల్లూరు ఇటుక పరిశ్రమలలో ప్రతి ఏటా డిసెంబరు నుంచి మే వరకు ఇటుక తయారీ జరుగుతుంది. ఇటుక తీసేందుకు నెల్లూరు, ప్రకాశంతో పాటు విశాఖ, రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లాల నుంచి కూలీలు తమ కుటుంబాలతో ఇక్కడకు వలస వచ్చి ఆరు నెలల పాటు ఇటుక బట్టీల వద్ద తమ నివాసాన్ని ఏర్పరచుకుంటారు. వీరితో పాటు స్థానికంగా ఉన్న మండల గ్రామాలతో పాటు భట్టిప్రోలు, వేమూరు మండలాల నుంచి కూడా ఇటుక పరిశ్రమలలో పనులు చేసేందుకు నిత్యం వందలాది మంది కూలీలు వచ్చి ఉపాధి పొందుతారు. ఈ ఏడాది ఇటుక ధరలు తగ్గిపోవడంతో పాటు గత ఏడాది తయారు చేసిన ఇటుకలు కూడా అమ్ముడు కాకపోవడంతో పరిశ్రమదారులు ఉత్పత్తిని తగ్గించి వేశారు. డిసెంబరులో ప్రారంభం కావాల్సిన ఇటుక ఉత్పత్తి జనవరి మధ్యలో ప్రారంభించారు. కోటి ఇటుకలు తీసే పరిశ్రమదారులు సైతం ప్రస్తుతం 50 లక్షల ఇటుకలు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నారు. 180 పరిశ్రమలలో ప్రస్తుతం 90 నుంచి 100 పరిశ్రమలు మాత్రమే ఇటుక ఉత్పత్తిని చేస్తున్నాయి. ప్రస్తుతం ఒక్కో ఇటుక తయారీకి రూ.5.30లు ఖర్చు అవుతుండగా ఇటుక అమ్మకాలు మాత్రం రూ.4.50 నుంచి రూ.4.80లు మాత్రమే జరుగుతుండటంతో పరిశ్రమదారులకు ఒక్కొక్క ఇటుకకు రూ.50 పైసలు నుంచి రూ.80 పైసలు వరకు నష్టం వస్తున్నట్లు చెబుతున్నారు. వెయ్యి ఇటుకకు రూ.500-800 అమ్మకాల్లో నష్టం వాటిల్లుతుండటంతో ఈ ఏడాది ఉత్పత్తి సగానికి సగం తగ్గించి వేశామని పరిశ్రమదారులు చెబుతున్నారు. ఉత్పత్తులు తగ్గడంతో ఆ ప్రభావం కూలీల జీవనంపై పడటంతో సగానికి సగం మంది ఈ ఏడాది ఇటుక పరిశ్రమల్లో పనులు లేకుండా పోయాయని పరిశ్రమ వర్గాలే చెబుతున్నాయి. రియల్ ఎస్టేట్ పుంజుకుని ఇటుక ధరలు పెరిగితే ఇటుక పరిశ్రమ మనుగడ కొనసాగుతాయని అంటున్నారు. లేదంటే పరిశ్రమ మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుంది.



కొల్లూరు మండలంలో ఇటుక ఉత్పత్తి చేస్తున్న కార్మికులు

నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ మరణం!

● రెండేళ్ల చిన్నారి మృతి

● గుంటూరులో హెచ్5ఎన్1 సర్వైలెన్స్ సెంటర్‌కు ఆమోదం



గుంటూరు మెడికల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి గుంటూరు జిల్లా నరసరావుపేటలో బర్డ్‌ఫ్లూ (ఎవియన్ ఇన్‌ఫ్లూయెంజా/ హెచ్5 ఎన్1) మరణం నమోదైంది. నరసరావుపేట పట్టణంలోని బాలయ్య నగర్‌కు చెందిన పెండ్యాల జ్యోతి అనే రెండేళ్ల చిన్నారి బర్డ్‌ఫ్లూతో మరణించినట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారులు మంగళవారం ధ్రువీకరించారు. గత నెలలో చిన్నారి బర్డ్‌ఫ్లూకు గురవ్వగా, కుటుంబీకులు చికిత్స కోసం మంగళగిరిలోని ఎయిమ్స్‌లో చేర్పించారు. చికిత్స పొందుతూ గత వారం చిన్నారి మృతి చెందగా, వ్యాధి లక్షణాలు బర్డ్‌ఫ్లూగా అనుమానించిన వైద్యనిపుణులు రక్తనమూనాలను పూణేలోని నేషనల్ వైరాలజీ ల్యాబ్‌కు పంపారు. జ్యోతి బర్డ్‌ఫ్లూతో మృతి చెందినట్లు సోమవారం ల్యాబ్ రిపోర్ట్ నిర్ధారించింది. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి నేతృత్వంలో వైద్య సిబ్బంది స్థానికంగా సర్వైలెన్స్ చేపట్టారు.

పల్నాడు డీఎంహెచ్‌వో అభ్యర్థన మేరకు గుంటూరు నుంచి మంగళవారం ర్యాపిడ్ రెస్పాన్స్ మెడికల్ టీమ్ నరసరావుపేటకు వెళ్లింది. ఈ బృందంలో సోషల్ అండ్ ప్రివెంటివ్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ సీతారామతో పాటు మైక్రోబయాలజీ, శిశువైద్యనిపుణులు ఉన్నారు. వీరు పట్టణంలోని బాలయ్య నగర్ పరిసర ప్రాంతాల్లో సర్వైలెన్స్ జరిపి నివేదికను డీఎంహెచ్‌కు అందజేస్తారు. పెండ్యాల జ్యోతి కుటుంబంలో ఇతర సభ్యులు ఆరోగ్యంగా ఉన్నారని, ఎవరికీ ఈ జబ్బు సోకిన దాఖలాలు లేవని వైద్య ఆరోగ్య శాఖ వర్గాలు వెల్లడించాయి. ముందస్తు జాగ్రత్తగా స్థానికంగా వైద్య సిబ్బంది సర్వైలెన్స్ చేపట్టారు. బర్డ్‌ఫ్లూ మనుషులకు సోకడం అరుదు. బర్డ్‌ఫ్లూ రోగుల్లో 50 శాతం మంది మృతి చెందే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు.

గుంటూరులో బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెంటర్...

ఇదిలా ఉంటే గుంటూరులో రీజనల్ బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెంటర్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ మేరకు గత వారం వైద్య కళాశాల మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మీకి రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ నుంచి సమాచారం అందింది. వైద్య కళాశాల ఆవరణలోని స్టేట్ రిఫరల్ వైరాలజీ ల్యాబ్‌కు అనుబంధంగా బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తారు. ప్రత్యేకంగా వైద్య పరికరాలు, ల్యాబ్ కన్స్యూమ బుల్స్ ఇతర అవసరమైన వాటిని అందజేస్తారు. 'ఇది రీజరల్ బర్డ్‌ఫ్లూ సర్వైలెన్స్ సెం టర్. గుంటూరు జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ అనుమానిత కేసులు నమోదైనప్పుడు ఇక్కడ వైద్యనిపుణులు సర్వే చేయడంతో పాటు రోగుల నుంచి రక్తనమునాలు సేకరించి వైరాలజీ ల్యాబ్‌లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తామని' జీఎంసీ మైక్రోబయాలజీ హెచ్‌వోడీ డాక్టర్ జయలక్ష్మీ మంగళవారం ఆంధ్రజ్యోతికి తెలిపారు.

14వ తేదీ వరకు సెలవులోకి కలెక్టర్

గుంటూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఎస్ నాగలక్ష్మి ఈ నెల 5వ తేదీ నుంచి సెలవుపై వెళ్లనున్నారు. గ్రీస్, టర్కీ దేశాలకు కుటుంబ సభ్యులతో కలిసి వ్యక్తిగత కారణాలతో పర్యటనకు వెళ్లేందుకు ఫిబ్రవరి 14వ తేదీనే రాష్ట్ర ప్రభుత్వ సాదారణ పరిపాలన శాఖ అనుమతించింది. ఈ నెల 5వ తేదీ నుంచి 14వ తేదీ వరకు కలెక్టర్ నాగలక్ష్మి అందుబాటులో ఉండరు. ఈ నేపథ్యంలో అప్పటివరకు ఇన్‌ఛార్జ్ బాధ్యతలను జాయింట్ కలెక్టర్ అమిలినేని భార్గవతేజ నిర్వర్తిస్తారని ప్రభుత్వం పేర్కొన్నది.



ఐకానిక్ మారిస్తే.. సమస్యే

(5వ పేజీ తరువాయి)

చర్చనీయాంశమైంది. ప్రస్తుతం రాయపూడి- మూలపాడు మధ్య నిర్మించేందుకు డీపీఆర్ తయారీ కోసం కన్సల్టెంట్లను ఆహ్వానిస్తూ ఏడీసీఎల్ తాజాగా ఓ నోటిఫికేషన్‌ను వెలువరించింది. అంటే ఐకానిక్ బ్రిడ్జిని గతంలో అనుకున్న స్థానంలో కాకుండా మరికొంచెం ఎగువన నిర్మించాలన్న ఆలోచనతో ఏడీసీఎల్ ఉన్నట్లు తెలు స్తోంది. అమరావతికి అవుటర్ రింగురోడ్డు పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. ఈ ఓఆర్ఆర్ తాలూకు కృష్ణానదిపై ఓ వంతెన రాబోతుంది. ఇది వైకుంఠపురం వద్ద ప్రస్తుతం బ్యారేజి కమ్ బ్రిడ్జి నిర్మించాలనుకుంటున్న ప్రాంతానికి సుమారు రెండు కిలోమీటర్ల ముందు వస్తుంది. వైకుంఠపురం బ్యారేజిని ప్రభుత్వం ప్రకాశం బ్యారేజి మాదిరి బ్యారేజి కమ్ బ్రిడ్జిగా నిర్మించాలని భావిస్తుంది. అంటే ఆ ప్రాంతంలో కృష్ణానదిపై రెండు రోడ్డు బ్రిడ్జిలు అనివార్యంగా రాబోతున్నాయన్నమాట. ఈ రెండు బ్రిడ్జిల మధ్య నుంచి మళ్లీ ఎర్రుపాలెం-నంబూరు మధ్య అమరావతి రైల్వేలైను వస్తుంది. అంటే వైకుంఠపురం బ్యారేజి కమ్ బ్రిడ్జికి ముందు అమరావతి రైల్వేలైను దానికి ముందు ఓఆర్ఆర్ వంతెన వస్తాయి. ఇక ప్రస్తుతం ఏడీసీఎల్ కొత్తగా ప్రతిపాదించిన ఐకానిక్ బ్రిడ్జి రాయపూడి, మూలపాడు మధ్య నిర్మాణం జరిగితే భవిష్యత్‌లో నిర్మించాలనుకుంటున్న అంతర వలయ రహదారికి ఇబ్బందులు వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతానికి కేంద్రం ఐఆర్ఆర్ ప్రతిపాదనను త్రోసిపుచ్చినప్పటికీ ముఖ్యమంత్రి చంద్రబాబు మాత్రం అమరావతికి భావి అసవరాల నిమిత్తం ఐఆర్ఆర్ తప్పనిసరని గట్టిగా వాదిస్తున్నారు. అవసరమైతే దానిని పబ్లిక్ ప్రైవేటు పార్ట్నర్‌షిప్ విధానంతో చేపడతామన్న సంకేతాలను కూడా ఇస్తున్నారు.

పెరగనున్న నిర్మాణ వ్యయం

అమరావతికి ఐఆర్ఆర్ కావాలంటే ఏడీసీఎల్ ప్రస్తుతం ప్రతిపాదించిన ఐకానిక్ బ్రిడ్జిని రాయపూడి-మూలపాడు మధ్య కాకుండా గతంలో మాదిరి రాయపూడి-ఫెర్రీ మధ్యే నిర్మించాలి. ఎందుకంటే దీనిని రాయపూడి-మూలపాడు మధ్య నిర్మిస్తే ఐఆర్ఆర్ తాలూకు రోడ్డు కృష్ణానదిని దాటేందుకు ఈ ఐకానిక్ బ్రిడ్జి అవరోధంగా మారడమో లేక దానికి అతిసమీపంగా రావడమో జరుగుతుంది. దీనివల్ల ఎన్టీఆర్ జిల్లా వైపు కృష్ణానదిపై వంతెనలు దగ్గరదగ్గరగా ఉన్నట్లు అనిపిస్తుంది. క్షేత్రస్థాయి పరిస్థితులను గమనంలో ఉంచుకుంటే అక్కడ ఐఆర్ఆర్ వంతెన గుంటూరు జిల్లా వైపు బోరుపాలెం, ఎన్టీఆర్ జిల్లా వైపు మూలపాడు మధ్య వస్తుంది. ఈ కొత్త ప్రతిపాధిత ఐకానిక్ బ్రిడ్జి రాయపూడి వద్ద ఎన్ 13 రోడ్డు- మూలపాడు మధ్య 5.2 కిలోమీటర్లు వస్తుంది. యథావిధిగా ఐకానిక్ బ్రిడ్జి ఇటు రాయపూడి అటు ఫెర్రీ మధ్య నిర్మిస్తే అది 3.2 కిలోమీటర్లు మాత్రమే వస్తుంది. ఇది అమరావతి వైపు ఎన్-10 రోడ్డును ఫెర్రీ వద్ద పవిత్ర సంగమాన్ని అనుసంధానిస్తుంది. నిజానికి ఐఆర్ఆర్ వద్దనుకుంటే తప్ప ఐకానిక్ బ్రిడ్జి పాత ఎలైన్‌మెంట్‌ను మార్చరాదన్న సంగతిని ఇక్కడ గమనించాలి. ఈ అంశాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఐకానిక్ బ్రిడ్జి ఎలైన్‌మెంట్‌ను మార్చే విషయమై పరిశీలించాలని పలువురు కోరుతున్నారు.

కృష్ణానదిపై అరడజను వంతెనలు

రాజధాని అమరావతి నిర్మాణంతో ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల నడుమ కృష్ణానదిపై అరడజనుకు పైగా వంతెనలు రాబోతున్నాయి. ప్రకాశం బ్యారేజికి ఎగువన ప్రారంభోత్సవానికి సిద్ధమవుతున్న విజయవాడ పశ్చిమ బైపాస్ వంతెన(ఆరు లేన్ల) వెంకటపాలెం-గొల్లపూడి మధ్య వస్తుంది. దీనికి పై వైపున గతంలో అమరావతికి గేట్‌వేగా ఐకానిక్ బ్రిడ్జిని రాయపూడి-ఫెర్రీ మధ్య నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. ఈ బ్రిడ్జి వల్ల ఎన్టీఆర్ జిల్లా వైపు హైదరాబాద్ హైవేతోపాటు జగదల్‌పూర్ హైవేను కూడా అమరావతికి అనుసంధానం చేసినట్లవుతుందని ప్రకటించారు. కానీ ప్రస్తుతం ఏడీసీఎల్ దీనిని గుంటూరు జిల్లా వైపు రాయపూడి నుంచే ప్రారంభిస్తున్నా ఎన్టీఆర్ జిల్లా వైపు మాత్రం కొంచెం ఎగువకు వెళ్లి మూలపాడు వద్ద కలిసేలా కొత్త ప్రతిపాదన చేసింది. దీనివల్ల జగదల్పూర్ హైవేతో అనుసంధానం తప్పిపోవడంతోపాటు కృష్ణానదిపై ఇంకా ఎగువన నిర్మించాలనుకుంటున్న బ్రిడ్జిల నిర్మాణంపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.

పఠనం.. ప్రోత్సాహం

◆ అందుబాటులో డిజిటల్ పుస్తకాలు
◆ పుస్తక పఠనంతోనే బాలల్లో సంపూర్ణ పరిపక్వత
◆ నేడు ప్రపంచ బాలల పుస్తక దినోత్సవం

గుంటూరు (విద్య), ఏప్రిల్ 1 (ఆంధ్ర జ్యోతి): ఆధునిక యుగంలో... శాస్త్ర, సాంకేతిక రంగాల్లో వస్తున్న వినూత్న మార్పుల కారణంగా... కుటుంబాల్లో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి ఇంట్లో స్మార్ట్ ఫోన్లు, స్మార్ట్ టీవీలు ఇతర సాంకేతిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో బాలల్లో పుస్తక పఠనం క్రమంగా సన్నగిల్లుతోంది. అయితే వారి కోసం ప్రచురించే పుస్తకాల ముద్రణ మాత్రం ఆగడం లేదు. పుస్తకాలను డిజిటల్ రూపంలో ముద్రించి అందుబాటులోకి తీసుకు వస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ బాలల పుస్తక దినోత్సవం సందర్భంగా ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం...

గ్రంథాలయాల ఆధ్వర్యంలో...

బాలల్లో పుస్తక పఠనం పాఠ్యపుస్తకాలికే పరిమితం కాకుండా వారు కథల పుస్తకాలను చదివేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఇందుకోసం ఏటా నిర్వహించే గ్రంథాలయ దినోత్సవాన్ని పురస్కరించుకుని దాదాపు నెల రోజులపాటు విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందించేందుకు వినూత్న కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు వారికి కొత్త పుస్తకాలు అందుబాటులోకి తీసుకువచ్చి చదివించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఆంగ్లం, తెలుగు మాధ్యమాల్లో పుస్తకాలు అందుబాటులోకి వచ్చాయి.



డిజిటల్ రూపంలోనూ...

పుస్తకాలు డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి వచ్చాయి. పంచతంత్ర కథలు, చందమామ కథలు, అక్బర్ బీర్బల్, తెనాలి రామకృష్ణ, అరేబియన్ నైట్స్ పేరుతో కథల పుస్తకాలు డిజిటల్ రూపంలో బాల లకు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్ర గ్రంథా లయాల్లో కూడా డిజిటల్ పుస్తకాలు విద్యార్థులకు అందుబాటులో ఉన్నాయి. ఇందుకోసం ప్రత్యేకంగా కంప్యూటర్లు కూడా అక్కడ ఏర్పాటు చేశారు. విద్యార్థులకు పుస్తక పఠనం పట్ల ఆసక్తిని పెంపొందించడమే లక్ష్యంగా ఏటా నిర్వహించే పుస్తక మహోత్సవాలు బాలల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేలా ప్రోత్సహిస్తున్నారు. ప్రత్యేక పోటీలు నిర్వహించి బాలల్లో పుస్తక పఠనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తున్నారు.

బాలల్లో కథల పట్ల ఆసక్తి పెంపొందించాలి



బాలల్లో కథల పట్ల, దేశనాయకుల పట్ల ఆసక్తి పెంపొందించడానికి పుస్తక పఠనం దోహదం చేస్తుంది. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపి విద్యార్థుల్లో పుస్తక పఠనం పెంపొందించేలా కృషి చేయాలి. జ్ఞానం, విజ్ఞానం, లోకజ్ఞానం, ఉల్లాసం ఉత్సాహం, వినోదం ఇలా ఎన్నో విభాగాలు బాలల సాహిత్యంలో ఉన్నాయి.

-కొండా శివరామిరెడ్డి, బుక్ లవర్స్ అధినేత

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

రెడ్డి పేరంటాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

నాదెండ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాతులూరులో రెడ్డి పేరంటాలమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం పలువురు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవాలయం పునఃప్రతిష్ఠ నిర్వహించి 16రోజులు కావటంతో పలువురు దంపతులు అమ్మవారికి పొంగళ్ళు పొంగించి నైవేద్యం సమర్పించారు. దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ప్రసాదాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ వజ్జె వీరాంజనేయులు, లక్ష్మీనారాయణ, కోటయ్యస్వామి, సీతయ్య, వెంకట సుబ్బారావు, నర్రా శ్రీనివాసరావు, రామారావు, పూర్ణచంద్రరరావు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన

చిలకలూరిపేట, ఏప్రిల్ 1(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 34వ వార్డు పరిధిలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ వార్డుకు చెందిన పలువురు మంగళవారం చిలకలూరిపేట నరసరావుపేట రోడ్డులో నిరసన తెలిపారు. ఆ రోడ్డులో భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా కర్రలు అడ్డంపెట్టి కొద్దిసేపు ట్రాఫిక్ నిలిపివేశారు.

ముగిసిన పది పరీక్షలు

వినుకొండ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇటీవల ప్రభుత్వం చేపట్టిన 10వ తరగతి పరీక్షలు మంగళవారంతో ప్రశాంతంగా ముగిశాయి. వినుకొండలో మొత్తం 10 సెంటర్లలో సుమారు 2660మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా ఓపెన్ టెన్త్ ద్వారా 300మంది పరీక్షలకు హాజరైనట్లు అధికారులు తెలిపారు.

పరీక్షా కేంద్రాల్లో అధికారుల తనిఖీ

రొంపిచర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజోతి): మండలంలోని రొంపిచర్ల, రెడ్డిపాలెం గ్రామాల్లో 10వ తరగతి పరీక్షా కేంద్రాలను సత్తెనపల్లి, రొంపిచర్ల మండల విద్యాశాఖ అధికారులు శ్రీనివాసరావు, బ్రహ్మేశ్వరరావులు మంగళవారం తనిఖీ చేశారు. మండలంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 10వ తరగతి పరీక్షలు ముగిశాయి.

పరుగు పందెంలో షేక్ అబ్దుల్లాకు మెడల్


సాధించిన మెడల్‌తో షేక్ అబ్దుల్లా

వినుకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పరుగు పందెంలో వినుకొండ పట్టణానికి చెందిన షేక్ అబ్దుల్లా మెడల్ సాధించినట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 30, 31 తేదీల్లో కర్ణాటక రాష్ట్రంలోని శ్రీకాంతిరావు స్టేడియంలో ఇండియన్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఈ పోటీలను నిర్వహించింది. 24 గంటల్లో 225 కిలో మీటర్లు పూర్తి చేయాల్సి ఉంది. షేక్ అబ్దుల్లా 200 కిలోమీటర్లు పరుగెత్తి ఈ మెడల్ సాధించాడు. ఈ సందర్భంగా అబ్దుల్లాను పట్టణంలోని పలువురు అభినందనలు తెలిపారు.

వితంతు పింఛన్ల పంపిణీ

చిలకలూరిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చిలకలూరిపేట మండలంలోని గంగన్నపాలెం, కోమటినేనివారిపాలెం గ్రామాలలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు జవ్వాజి మదన్ మోహన్, గ్రామ పార్టీ నాయకులు లబ్ధిదారుల గృహాలకు వెళ్లి, వితంతు పింఛన్లను మూడు నెలల మొత్తం రూ.12 వేలు సిబ్బందితో అందజేశారు.

యాచకుడు మృతి

వినుకొండ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రకాష్ గుడ్‌లక్ స్టోర్ వద్ద గుర్తుతెలియని ఓ వృద్ధ యాచకుడు మృతి చెందిన సంఘటన మంగళవారం జరిగింది. యాచకుడు అనారోగ్యంతో బాధపడుతూ మృతిచెందడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా మృతదేహాన్ని వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. యాచకుడి వివరాలు తెలియాల్సి ఉంది.

కేజీబీవీలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

బొల్లాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్, బైపీసీ, ఇంగ్లీషు మీడియం గ్రూపుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రిన్సిపాల్ లీలావతి మంగళవారం తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. బడి బయట అనాథ పిల్లలు, బడి మానివేసిన పిల్లలను, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల్లో పేదవర్గాల బాలికలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు కస్తూర్బా బాలికల విద్యాలయంలో సంప్రదించాలన్నారు.

శ్మశాన వాటికల్లో పిచ్చి మొక్కలు తొలగించరూ...

చిలకలూరిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఐదు శ్మశాన వాటికలను ఈ నెల 20న జరిగే ఈస్టర్ పండుగలోపు శుభ్రం చేయించాలని, అక్కడి గొట్టపు బావులకు మరమ్మతులు చేయించాలని స్థానిక టీడీపీ నాయకులు పలువురు మంగళవారం మునిసిపల్ చైర్మన్ షేక్ రఫానీకి వినతి పత్రం అందచేశారు. చైర్మన్‌ను కలిసిన వారిలో మద్దుమాల రవి, కొండా వీరయ్య, గట్టుపల్లి మాణిక్యరావు, శానం శ్రీనివాసరావు, కొండేపాటి రమేష్ బాబు, తాడిమల్ల చందు ఉన్నారు.

ఘర్షణపై కేసు నమోదు

బొల్లాపల్లి, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు ఘర్షణ పడిన ఘటనపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని గుమ్మనంపాడుకు చెందిన రామగిరి నాసర్ వలి, ఆళ్ళ సాంబిరెడ్డి బాకీ విషయమై మేళ్ళవాగు తిరునాళ్ళలో స్వల్ప ఘర్షణ జరిగింది. అనంతరం ఇద్దరు గుమ్మనంపాడు గ్రామానికి చేరుకొని ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. సమాచారం తెలుసుకున్న ఎస్‌ఐ బాలకృష్ణ గ్రామానికి చేరుకొని ఇద్దరు ఇచ్చిన ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.


పింఛన్ పంపిణీ చేస్తున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు

ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో

పేదలను ఆదుకుంటాం

● చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో పేదలను ఆదుకుంటామని ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు అన్నారు. పట్టణంలోని 28వ వార్డు ఓబయ్యకాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులుతో పాటు మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు పాల్గొన్నారు. నిరుపేద వృద్ధులకు పింఛన్ల పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వినుకొండలో లెదర్ పార్కు వస్తే వ్యక్తిగతంగా పెట్టుబడి పెట్టడానికి తాను సిద్ధంగా ఉన్నానని, పారిశ్రామికవేత్తగా చంద్రబాబు అప్పజెప్పిన బాధ్యతను తీసుకొని సేవలు అందిస్తామని జీవీ ఆంజనేయులు అన్నారు. పేదరికం లేని సమాజం కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆదుకోవడమే లక్ష్యంగా చంద్రబాబు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్రంలోని పది శాతం ధనవంతుల్లో 25శాతం ఉన్న నిరుపేదలను ఆదుకోవాలన్న లక్ష్యంగా పీ4 సర్వేలో పేదరికం లేని సమాజం కోసం సేవలు అందించడం జరుగుతుందన్నారు. 2047 కల్లా తలసరి ఆదాయం రూ.50లక్షలకు సగటున పెంచి ఆర్థిక ప్రగతి సంతోషం, ఆరోగ్యం, మూడు రంగాల్లో పేదలకు అందించాలన్న లక్ష్యంతో ముందుకు వెళుతున్నామన్నారు. పెట్టుబడిదారుల ద్వారా వచ్చిన ఆదాయాన్ని పేదలకు అందిస్తామన్నారు. గొప్ప ఆలోచనతో చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని, రానున్న రోజుల్లో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పథకాలన్నీ అమలు చేస్తామన్నారు. చంద్రబాబు ముందస్తు ఆలోచనతో రెండు పండుగ సెలవులు వచ్చినప్పటికీ 1వ తేదీన పింఛన్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి, జనసేన పార్టీ నాయకులు నాగశ్రీనురాయల్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఆయూబ్ ఖాన్, జానీ, పీవీ సురేష్, పత్తి పూర్ణ, క్లస్టర్ ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. అనంతరం మండలంలోని గోకనకొండలో పింఛన్ పంపిణీ కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పశువుల నీటితొట్టెల ఏర్పాటుకు పనులు ప్రారంభం

వినుకొండ టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగులవరంలో ఉపాధి హామీ పథకం కింద మూగ జీవాల కోసం నీటి తొట్టి నిర్మాణ పనులను మంగళవారం ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవిలో పశువులకు తాగునీరు, గడ్డి కొరత లేకుండా చూసేందుకు ఎన్‌డీఏ ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అవసరమైన చోట్ల తాగునీటి తొట్టెలు నిర్మిస్తున్నామన్నారు. ఒకొక్క తొట్టికి రూ.33,200లతో నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. బోరు మోటారు ద్వారా ఎప్పటికప్పుడు నీటితో నింపి పశువులకు నీటి సరఫరా చేయడం జరుగుతుందన్నారు. వీటిద్వారా పొలాలు, అడవుల నుంచి వచ్చే పశువులకు ఇబ్బందులు తప్పుతాయన్నారు. పల్నాడు జిల్లాలో 317 తొట్లను రూ.1.05కోట్లతో నిర్మించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. వినుకొండ నియోజకవర్గంలో రూ.18.26లక్షలతో 55 తొట్టెలను నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. కేవలం 15రోజుల్లో నిర్మాణ పనులను పూర్తి చేయాలని ఉపాధి సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, ఎంపీడీవో పుల్లారెడ్డి, ఏపీవో కట్టా నాగేశ్వరరావు, వీరగంధం ఆనంద్, మండల పార్టీ అధ్యక్షుడు మాదినేని అంజనేయులు, మక్కెన కొండలు, చిరంజీవి, బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

● బొల్లాపల్లి: మండలంలోని వడ్డెంగుంట గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పథకం నిధులతో పశువులకు నీటి తొట్టి నిర్మాణం కార్యక్రమానికి తహసీల్దార్ సుధాకర్ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి పెమ్మసాని నాగేశ్వరరావులు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ మూగజీవాల దాహార్తి తీర్చటానికి రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు శంకుస్థాపన చేయటం జరిగిందన్నారు. అలాగే గ్రామంలో ఎన్‌టీఆర్ భరోసా పింఛన్‌లను పంపిణీచేస్తూ రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలను అందిస్తోందని ముఖ్యంగా వృద్ధులు, వికలాంగులు, ఇతర నిరుపేద వర్గాల వారికి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో ఏపీవో లక్ష్మణ్, వీఆర్‌వో నరసింహారావు, టీడీపీ నాయకులు, ఉపాధి హామీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి

● మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలి
● బాధితులతో కలిసి జేసీకి ఎమ్మెల్యే డాక్టర్ అరవిందబాబు వినతి


జేసీ సూరజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, రైతులు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): చీరాల ఓడరేవు- నకరికల్లు అడ్డరోడ్డు 167ఏ నేషనల్ హైవే కోసం భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలని, మిర్చి రైతుల గిట్టుబాటు ధర కల్పించాలని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు కోరారు. మంగళవారం నరసరావుపేటలోని పల్నాడు కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరేను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ, రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడుతూ 167ఏ నేషనల్ హైవేకి భూములు కోల్పోయిన జొన్నలగడ్డ రైతులకు ఇచ్చే నష్టపరిహారం గుంటగార్లపాడు, కేసానుపల్లి రైతులకు ఇవ్వాలన్నారు. జొన్నలగడ్డ రైతులకు ఎకరాకు రూ.కోటి 70 లక్షలు ఇవ్వాలని గ్రామసభలో నిర్ణయించారన్నారు. అదేవిధంగా గుంటగార్లపాడు, కేసానుపల్లి రైతులకు కూడా నష్టపరిహారం చెల్లించి రైతులకు న్యాయం చేయాలన్నారు. దీనికి సంబంధించి వారం రోజులు సమయం ఇవ్వాలని, రైతులకు న్యాయం చేసేందుకు జేసీ హామీ ఇచ్చారని ఎమ్మెల్యే తెలిపారు. గతంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్‌కు విషయం తెలియజేశామన్నారు, వారు కూడా స్పందించారన్నారు. కూటమి ప్రభుత్వం ఎప్పుడూ రైతుల పక్షానే ఉంటుందన్నారు. అదే విధంగా పంట కుంటలు, పశువుల కుంటలు ప్రభుత్వం దగ్గరుండి ఎన్‌ఆర్‌జీఈఎస్‌ల ద్వారా పూర్తి చేస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం వరికి గిట్టుబాటు ధర కల్పించడం జరిగిందన్నారు. ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేశారు. ఇప్పుడు ప్రధానంగా రైతులు మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని అడుగుతున్నారన్నారు. ఆరుగాలం కష్టపడి, ఎకరాకు రూ.3లక్షలు ఖర్చుచేసి మిర్చి సాగు చేస్తున్నామన్నారు. ఎరువులు, విత్తనాలు రేట్లు పెరిగాయన్నారు. క్వింటా మిర్చి ఈ రోజు రూ.8 వేలు, రూ.9 వేలకు కూడా కొనడం లేదన్నారు. అందువలన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ స్పందించి మిర్చి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఇప్పటికే ఈ విషయంపై క్యాబినెట్ చర్చించిందని, మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారన్నారు. తప్పనిసరిగా కూటమి ప్రభుత్వం మిర్చి రైతుకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. కార్యక్రమంలో యర్రం వెంకటేశ్వర్లు, ప్రసన్నాంజనేయస్వామి, చిరుమెళ్ళ మల్లికార్జునరావు, 167ఏ నేషనల్ హైవేకి భూములు ఇచ్చిన రైతులు, పీడీఎం నాయకులు వై వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు తదితరులు పాల్గొన్నారు.

సాగర్ కుడికాలువ పరిధిలో మరమ్మతులు చేపట్టాలి

● పీడీఎం రాష్ట్ర నాయకుడు వెంకటేశ్వరరావు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో కాలువలకు మరమ్మతులు చేపట్టాలని పీడీఎం రాష్ట్ర నాయకుడు వై వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. మంగళవారం నరసరావుపేటలో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నాగార్జున సాగర్ కుడి కాలువ పరిధిలో ఉన్న కాలువలను దశాబ్దాలు గడుస్తున్నా రిపేర్లు చేయకుండా ప్రతి సంవత్సరం బడ్జెట్లో కేటాయిస్తున్నారన్నారు. పనులు మాత్రం ఎక్కడ జరుగుతున్నాయో స్పష్టత లేదన్నారు. నరసరావుపేట, వినుకొండ, పిడుగురాళ్ళ, సత్తెనపల్లి, చిలకలూరిపేట ఎక్కడ చూసినా కాలువలు చెట్లు మొలవటం, కంప చెట్లతో నిండి ఉండటంతో కాలువలు తెగి పంట పొలాలకు నష్టం జరుగుతోందన్నారు. ఈ విషయంపై అనేకసార్లు స్థానిక అధికారుల దృష్టికి తీసుకెళ్ళినా, గ్రీవెన్స్ సెల్‌లో కలెక్టర్‌కు అర్జీలు ఇచ్చినా పరిష్కారం కావట్లేదన్నారు. ఎన్ఎస్‌పీ అధికారులు అంచనాలు రూపొందిస్తున్నామని, అనుమతులు, బడ్జెట్ కేటాయింపులు పూర్తికాగానే పనులు మొదలు పెడతామంటూ కాలక్షేపం చేస్తున్నారని ఆరోపించారు. అనేక ప్రాంతాలలో కాలువకట్టలు ఆక్రమణలకు లోనవుతున్నా అధికారులు మౌనంగా ఉంటున్నారని చెప్పారు. అధికారులు స్పందించి నాగార్జున సాగర్ పరిధిలో ఉన్న కాలువలు రిపేర్లు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు. సమావేశంలో నల్లపాటి రామారావు, బీసీ నాయకులు బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు

యడ్లపాడు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో పదహారో నంబరు జాతీయ రహదారిపై సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సత్తెనపల్లికి చెందిన ఆళ్ళ అజయ్ సోమవారం రాత్రి చిలకలూరిపేట నుంచి గుంటూరుకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. యడ్లపాడు ఎర్రకొండ సమీపంలో మద్యం సేవించి తూలుతూ నడిచి వెళుతున్న గుర్తు తెలియని యువకుడిని ఢీకొట్టాడు. దీంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి వంతెన గోడకు ఢీకొని, వంతెనపై నుంచి దిగువన ఉన్న సర్వీసురోడ్డుపై పడ్డాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన అజయ్‌ను గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గుర్తు తెలియని యువకుడిని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి చికిత్సకోసం తరలించారు. అయితే ప్రమాదానికి గల కారణంపై స్పష్టత రాలేదని, యువకులు కోలుకున్న తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయని ఎస్‌ఐ తెలిపారు. గుర్తు తెలియని యువకుడు ఒరిస్సాకు చెందిన వలస కార్మికుడు అయి ఉండవచ్చని, మండలంలోని నూలుమిల్లులో పనిచేస్తూ ఉండి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ప్రమాద ఘటనపై కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ బాలకృష్ణ తెలిపారు.

తిరునాళ్ళలో నాలుగు ద్విచక్రవాహనాల చోరీ

బొందిలిపాలెం (శావల్యాపురం) ఏప్రిల్ 1: మండలంలోని బొందిలిపాలెంలో మార్చి30వ తేదీన జరిగిన తిరునాళ్ళలో గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు ద్విచక్రవాహనాలు, కొన్ని మొబైల్ ఫోన్‌లను చోరీ చేసినట్లు ఎస్‌ఐ లేళ్ళ లోకేశ్వరరావు మంగళవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ వెల్లలచెరువు, ఈపూరు తదితర గ్రామాలకు చెందిన కొందరు భక్తులు తిరునాళ్ళ వేడుకల్లో పాల్గొనేందుకు వచ్చి రోడ్లపక్కన ద్విచక్రవాహనాలు నిలిపి ఉంచగా గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు చోరీపై దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ఉగాది పురస్కార గ్రహీత జాస్తి వీరాంజనేయులుకు సత్కారం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉగాది పురస్కారం అందుకున్న డాక్టర్ జాస్తి వీరాంజనేయులును ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు సత్కరించారు. నరసరావుపేట పట్టణంలోని కార్యాలయంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబును జాస్తి మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు జాస్తి వీరాంజనేయులును శాలువతో సత్కరించి అభినందించారు.

30వ తేదీలోగా ఈకేవైసీ చేయించుకోవాలి

నూజెండ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఏప్రిల్ 30వ తేదీ లోగా రేషన్ కార్డుల లబ్ధిదారులు ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ జీ రమేష్ కుమార్ మంగళవారం తెలిపారు. రేషన్ డీలర్ వద్ద ఈకేవైసీ పెండింగ్ ఉన్న వారు త్వరితగతిన ఈకేవైసీ చేయించు కోవటం ద్వారా కుటుంబ సభ్యులందరికీ ప్రభుత్వం నుంచి రేషన్ బియ్యం అందుతాయన్నారు.

విశ్రాంత సీఐ బండి రాధాకృష్ణ మృతి

చిలకలూరిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బండి రాధాకృష్ణ (67) అనారోగ్యంతో పాత గుంటూరులోని గొలుసు కొండలరావునగర్ 2వ లైన్‌లోని స్వగృహంలో మృతి చెందినట్లు ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ స్థాయికి ఎదిగి చిలకలూరిపేటలో రిటైర్‌య్యారని కుటుంబసభ్యులు తెలిపారు. మంగళగిరి, యడ్లపాడు తాడేపల్లి, చిలకలూరిపేట మండలాలలో ఆయన ఎస్‌ఐగా విధులు నిర్వహించారన్నారు. రాధాకృష్ణకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. నేడు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు చెప్పారు.

నేడు చౌడేశ్వరీ దేవి అమ్మవారి తిరునాళ్ల



ఈపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముప్పాళ్ళలో చౌడేశ్వరీదేవి అమ్మవారి తిరునాళ్ల బుధవారం నిర్వహించనున్నట్లు గ్రామస్థులు తెలిపారు. తిరునాళ్ళను పురస్కరించుకొని మంగళవారం జలబిందెలతో ఊరేగింపు నిర్వహించారు. తిరునాళ్ల రోజు చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తుల అమ్మవారిని దర్శించుకొని పూజలు చేస్తారు. రాత్రి అమ్మవారి జ్యోతుల ఊరేగింపు జరుగుతుంది.

ఏఎస్‌ఐ సురేంద్రనాథ్‌కు సత్కారం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 1, (ఆంధ్రజ్యోతి), పోలీస్ శాఖలో 35 సంవత్సరాలు సేవలందించి ఏఎస్‌ఐగా ఉద్యోగ విరమణ పొందిన పి.సురేంద్రనాథ్‌ను మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న పల్నాడు జిల్లా ఎస్పీ కంచి శ్రీనివాసరావు సురేంద్రనాథ్‌ను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పరిపాలన అదనపు ఎస్పీ సంతోష్, ఏఆర్ అదనపు ఎస్పీ సత్తిబాబు, ఏవో రామారావు, ఏఆర్ డీఎస్పీ మహాత్మాగాంధీరెడ్డి, పల్నాడు జిల్లా పోలీసు అసోసియేషన్ ప్రెసిడెంట్ టి.మాణిక్యాలరావు, హోంగార్డ్ కృష్ణ, వెల్ఫేర్ ఆర్ఐ గోపీనాథ్, సురేంద్రనాథ్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బావిని బాగు చేయించరూ...


పిచ్చిమొక్కల నడుమ ఉన్న బావి

రొంపిచర్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజోతి): మండలంలోని వీరవట్నం గ్రామంలో మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద ఉన్న బావి పూడికతో నిరుపయోగంగా మారింది. గతంలో ఈ బావి ద్వారా గ్రామంలో నీటి అవసరాలు ప్రజలు తీర్చుకునేవారు. అయితే దీనిలో పూడిక ఏర్పడి ఊట రాకపోవటంతో గ కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారింది. ప్రజలకు ప్రత్యామ్నాయ సౌకర్యాలు అమరటంతో దీనిని పూర్తిగా పట్టించుకోవటం మానివేశారు. దీనిలో పూడిక తీసి స్థానిక అవసరాలకు బావిని వినియోగంలోకి తెచ్చేలా అధికారులు, ప్రజా ప్రతినిధులు కృషి చేయాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు.


క్యాన్సర్ బాధితుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

క్యాన్సర్ బాధితుడికి రూ.15లక్షల ఎల్‌వోసీ అందజేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని ఎన్టీఆర్ నగర్‌లోని టిడ్కో గృహాల్లో నివసిస్తున్న కనుమూరి శ్రీనివాసరావు అనే క్యాన్సర్ బాధితుడికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరుచేసిన రూ.15 లక్షల ఎల్‌వోసీని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు మంగళవారం అందించారు. బాధితుడు గృహానికి వెళ్లి పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధితుని సోదరుడు సత్యం మాట్లాడుతూ వైద్యచికిత్సకు ఇప్పటివరకు రూ.10లక్షలు వెచ్చించామని, సాయం అందని స్థితిలో ఎమ్మెల్యేని కలిసి విన్నవించగా, ఎమ్మెల్యే హైదరాబాద్ లోని బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి వారితో మాట్లాడి, వైద్యసాయం, ప్రభుత్వ సాయం అందేలా చూశారని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే

వారం రోజుల్లో రీ సర్వే పూర్తి చేయాలి: జేసీ

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): పల్నాడు జిల్లాలో 25 గ్రామాల్లో పైలట్ ప్రాజెక్టుగా నిర్వహిస్తున్న రీ-సర్వే పనులను వారం రోజుల్లో పూర్తిచేయాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ, రీ సర్వే, పౌర సరఫరాల శాఖ అధికారులతో జాయింట్ కలెక్టర్ మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ రీ సర్వేలో నమోదైన వివరాలు సరిచేసి గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తిచేయాలన్నారు. అనంతరం రెండో దశ గ్రామాల ఎంపిక పూర్తిచేసి గ్రామ సరిహద్దులు నిర్ణయించే కార్యక్రమం ప్రారంభించాలన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి రేషన్ కార్డుదారుల ఈకేవైసీ పూర్తిచేయాలన్నారు. పల్నాడు జిల్లాలో పెద్ద సంఖ్యలో ఈ కేవైసీ పెండింగ్‌లో ఉందన్నారు. రెవెన్యూ అధికారులు సమన్వయంతో పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి నారదముని, ఆర్డీవో మధులత, సర్వే ఏడీ భానుకీర్తి, నరసరావుపేట తహసీల్దార్ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

15 వరకు సాగునీరు ఇప్పించరూ..

● జలవనరుల శాఖ మంత్రి నిమ్మలకు డీసీ చైర్మన్ వినతి


మంత్రి రామానాయుడుకు వినతిపత్రం అందిస్తున్న డీసీ వేణుగోపాల్‌రావు

ఈపూరు, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ కుడి కాలువకు ఈ నెల 15వ తేదీ వరకు సాగునీరు విడుదల చేయాలంటూ డీసీ చైర్మన్ గడిపూడి వేణుగోపాల్‌రావు రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం సాగుచేసిన పంటలు చివర దశలో ఉన్నాయని ఇప్పుడు పంటకు నీరు అందించకపోతే పూర్తిగా నష్టపోతామన్నారు. ముఖ్యంగా వరిపైరు కంకి దశలో ఉందని నీరు లేకపోతే దిగుబడి పూర్తిగా తగ్గుతుందన్నారు.

నీరు చెట్టు బిల్లులు విడుదల చేయరూ...

నూజెండ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): 2019కి ముందు టీడీపీ ప్రభుత్వ సమయంలో చేసిన నీరు చెట్టు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలకు చేసిన బిల్లులు రాకపోవటంతో తాము ఆర్థికంగా నష్టపోయామని, సంబంధిత బిల్లులు త్వరితగతిన విడుదల చేయాలని విజయవాడలో టీడీపీ నేతలు మంగళవారం రాష్ట్ర భారీ నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును కలసి విజ్ఞప్తి చేశారు. కాలువల మరమ్మతులకు నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్‌లు నక్కా బుల్లీశ్వరరెడ్డి, ముక్కినేని ఏడుకొండలు, గడిపూడి వేణుగోపాలరావు, టీడీపీ నేతలు ముంద్రు సుబ్బారావు, మరిడి సురేష్, వెంకట నరసయ్య, తదితరులు పాల్గొన్నారు.

కల్లాల్లో 15 క్వింటాళ్ళ ఎండుమిర్చి చోరీ

నూజెండ్ల, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): ఆరు గాలం కష్టించి పండించిన పంట దొంగలు ఎత్తుకుపోవటంతో నష్టపోయానని రైతు ఆవేదన వ్యక్తం చేసిన సంఘటన మండలంలోని పాత ఉప్పలపాడులో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మీసాల నాగేశ్వరరావు తాను పండించిన మిర్చి పంటను పొలానికి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో ఆర బెట్టుకున్నాడు. మంగళవారం మిర్చి అమ్ముకొనేందుకు మార్కెట్‌కు తీసుకు వెళ్ళేందుకు శుక్రవారం సాయంత్రం మిర్చి కల్లం వద్ద ఏర్పాట్లు చేసుకొని ఇంటికి వెళ్ళి ఉదయం వచ్చి చూసేసరికి 15క్వింటాళ్ళకు పైగా ఎండుమిర్చి చోరీకి గురవ్వటంతో నిర్ఘాంతపోయాడు. రెండు లక్షల రూపాయలకు పైగా విలువైన మిర్చి చోరీకి గురైనట్లు ఐనవోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


వేల్పూరులో పింఛనులు పంపిణీ చేస్తున్న జడ్పీటీసీ హైమావతి

ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ

శావల్యాపురం, ఏప్రిల్ 1 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో పింఛను లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్‌లను మంగళవారం సచివాయ ఉద్యోగులు ఇంటింటికీ తిరిగి పంపిణీ చేశారు. వేల్పూరులో జడ్పీటీసీ పారా హైమావతి, కొత్తలూరులో మండల టీడీపీ అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు, కనమర్లపూడిలో పల్నాడు జిల్లా తెలుగు రైతు ఉపాధ్యక్షుడు గోరింట్ల హనుమంతరావు, శావల్యాపురంలో ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య పాల్గొని లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అందజేశారు. నాయకులు మాట్లాడుతూ పింఛను పొందుతున్న వ్యక్తి మరణిస్తే మరుసటి నెలలోనే మృతుని భార్యకు ప్రభుత్వం వితంతు పింఛనును అందజేసి వారి కుటుంబానికి భరోసా ఇస్తుందన్నారు.